నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 6-1-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 132 పేజీలు: 4 వెల: రూ.1/-

అన్ని రంగాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలి

ఆయా రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు సూచన

చెన్నై,జనవరి5(ఆర్ఎన్ఎ): అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉన్నదని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు సూచించారు. శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంజినీరింగ్, గణితం (ఎస్‌టీఈఎం).. ఈ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. భారతదేశంలో అత్యధికంగా మహిళా నిపుణులు తయారవుతుండగా, ఉద్యోగాల్లో వారి వాటా 14 శాతం మాత్రమే ఉన్నదని, ఈ పరిస్థితి మారాలని ఆకాంక్షించారు. అలాగే, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పరిశోధన రంగాల్లో సైతం చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమాటికల్ సైన్సెస్‌లో శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంజినీరింగ్, గణితం రంగాల్లోని నవీన పోకడల గురించి, డాటా సైన్స్ విప్లవానికి ధీటుగా ఉద్యోగ కల్పనలో సామర్థ్యాన్ని పెంచుకోవలసిన అవసరం గురించి ఉపరాష్ట్రపతి దిశా నిర్దేశం చేశారు. డాటా కారణంగా శాస్త్రీయ విజ్ఞాన పోకడలు మారాయని అభిప్రాయపడ్డారు. యువ గ్రాడ్యుయేట్లు ఈ నూతన నైపుణ్యానికి ధీటుగా తమ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు సంప్రదాయ ఇంజినీరింగ్ పాఠ్యాంశాలను నవీకరించాలన్నారు. ఐఐటీల వంటి జాతీయ సంస్థలు అందిస్తున్న దూర విద్య కోర్సుల విస్తరణ పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఉపరాష్ట్రపతి.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రాంతీయ భాషల్లో సాంకేతిక కోర్సులను అందించాలని సూచించారు. దేశానికి గర్వకారణమైన గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సేవలను కొనియాడారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని పిలుపునిచ్చిన వెంకయ్యనాయుడు.. పిల్లల్లో గణితం పట్ల ఆసక్తిని పెంచేందుకు రోట్ మెమోరైజేషన్ లాంటి ప్రత్యామ్నాయ సృజనాత్మక పద్ధతులను అవలంబించాలని సూచించారు. శాస్త్రీయ పరిజ్ఞానం దిశగా విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా స్టెమ్ రంగాన్ని బలోపేతం చేయడానికి.. ఈ దిశగా పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రైవేట్ విద్యా సంస్థలతో భాగస్వామ్యం వహించాలన్నారు. సైన్స్ అవుట్ రీచ్ కార్యక్రమాలను చేపట్టిన ఇన్‌స్టిట్యూట్ చొరవను ప్రశంసించిన ఉపరాష్ట్రపతి.. సమాజంలో ముఖ్యంగా పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానం పట్ల జిజ్ఞాసను పెంచడం తక్షణావసరమని తెలిపారు. ఈ సందర్భం గా ఐఎంఎస్సీ ప్రాంగణంలో నూతన నివాస సముదాయాన్నిఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి కేపీ అన్బళగన్, ఐఎంఎస్సీ డైరక్టర్ ప్రొఫెసర్ వీ అరవింద్, కల్పకం అటమిక్ ఎనర్జీ విభాగం ఐజీసీఏఆర్ డైరక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ భాదురి, రిజిస్ట్రార్ విష్ణు ప్రసాద్ సహా ఐఎంఎస్సీ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిసంపులో పడి బాలుడు మృతి

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): హయత్‌నగర్‌లోని ఆర్‌కే నగర్‌లో విషాదం నెలకొంది. ఇంటికి సమీపంలో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఓ బాలుడు నీటి సంపులో పడిపోయాడు. అయితే రాత్రి అయినా కూడా బాలుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎవరైనా అతన్ని అపహరించి ఉంటారని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరుగుపొరుగు వారు బాలుడి ఆచూకీ కోసం వెతకగా, సంపులో అతడి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆర్‌కే నగర్ చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి డెడ్‌బాడీని తరలించారు. మృతుడిని రిజ్వాన్(4)గా పోలీసులు గుర్తించారు. మృతుడి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

దేశంలో 68కి చేరిన న్యూ స్ట్రెయిన్ కేసులు

వెల్లడించిన కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): దేశంలో ఒకవైపు కరోనా మహమ్మారి ప్రభావం తగ్గుతుండగానే మరోవైపు యూకేలో విజృంభిస్తున్న కరోనా న్యూ స్ట్రెయిన్ కలకలం రేపుతున్నది. యూకే నుంచి దేశంలో కాలుమోపిన కొత్త రకం కరోనా రోజురోజుకు విస్తరిస్తున్నది. దేశంలో ఇప్పటివరకు మొత్తం 58 మందిలో కొత్త రకం కరోనా లక్షణాలు బయటపడ్డాయని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. సోమవారం నాటికి 38 మందిలో న్యూ స్ట్రెయిన్ ధృవీకరణ కాగా, మంగళవారం కొత్తగా మరో 20 మందిలో న్యూ స్ట్రెయిన్ బయటపడిందని పేర్కొన్నది. యూకేలో రెండు వారాల క్రితం కరోనా న్యూ స్ట్రెయిన్ ప్రభావం మొదలైంది. మునుపటి కరోనా వైరస్ కంటే ఈ కొత్త రకం కరోనా ఉత్పరివర్తనం అత్యంత వేగంగా విస్తరిస్తున్నదని ఆరోగ్య నిపుణులు గుర్తించారు. ఇటీవల యూకే నుంచి భారత్‌కు వచ్చిన వారి ద్వారా ఈ న్యూ స్ట్రెయిన్ దేశంలో ప్రవేశించింది. భారత్‌తోపాటు డెన్మార్క్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, ఇటలీ, స్వీడన్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, జర్మనీ, కెనడా, జపాన్, లెబనాన్, సింగపూర్ దేశాల్లో కూడా న్యూ స్ట్రెయిన్ విజృంభణ మొదలైంది.

కరోనాను రాజకీయంగా వాడుకుంటున్న సర్కార్: మనీష్ తివారీ

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కరోనా మహమ్మారిని కూడా రాజకీయంగా వాడుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నేత మనీష్ తివారీ ఆరోపించారు. ఇప్పుడు కరోనా వ్యాక్సిన్‌పై వివాదం కూడా బీజేపీ కొత్త పన్నాగం అని ఆయన విమర్శించారు. ఎన్నో సందేహాలకు సమాధానాలు లేకుండా ఉన్న వ్యాక్సిన్‌ను తీసుకునేందుకు ఎవరు ముందుకొస్తారని ప్రశ్నించారు. వ్యాక్సిన్‌పై పరిశోధన, అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టించి ఓ కంపెనీకి బీజేపీ ప్రభుత్వం తీవ్ర అపచారం చేసిందని మనీశ్ తివారీ మండిపడ్డారు. ఇప్పుడు తమ ఆత్మనిర్భర్ భారత్‌ను నిరూపించుకోవాలనే తపనతో ఫేజ్-3 ట్రయల్స్ కూడా పూర్తికాని ఓ వ్యాక్సిన్‌కు మోదీ ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చిందని ఆరోపించారు.

కోవిడ్ టీకాను సాఫీగా అందిస్తాం..

సీరం, భారత్ బయోటెక్ సంయుక్త ప్రకటన

హైదరాబాద్, జనవరి 5: పుణెలోని సీరం ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్‌లోని భారత్ బయోటెక్ సంస్థ ఇవాళ కోవిడ్ టీకా అంశంపై సంయుక్త ప్రకటన చేశాయి. సీరం సీఈవో ఆదర్ పూనావాలా, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా మీడియాకు ఓ లేఖను రిలీజ్ చేశారు. టీకాల అవసరంపై తమకు పూర్తి స్థాయి అవగాహన ఉన్నట్లు ఇద్దరూ వెల్లడించారు. భారత్ లాంటి దేశాలకు టీకా ప్రాముఖ్యత చాలా కీలమైందన్నారు. కోవిడ్19 వ్యాక్సిన్‌ను దేశ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా సాఫీగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇద్దరూ సంయుక్త వాగ్దానం చేశారు. కోవిడ్ వల్ల ప్రపంచ దేశాలు అతలాకుతలం అయ్యాయని, భారత్‌తో పాటు ఇతర దేశాల ప్రజలను రక్షించాలన్న ఉద్దేశంతోనే టీకాలను ఉత్పత్తి చేస్తున్నట్లు ఆదార్ పూనావాలా, కృష్ణ ఎల్లా తెలిపారు. ప్రజా ఆరోగ్యం కోసం వ్యాక్సిన్లు అత్యంత కీలకమైనవని, ప్రాణాలను కాపాడడమే కాదు, ఆ టీకాలతో మళ్లీ ఆర్థిక వ్యవస్థలు గాడిలో పడుతాయని తమ ప్రకటనలో వారు అభిప్రాయపడ్డారు.

సజావుగా అందిస్తాం..

ఇండియాలో రెండు టీకాలకు ఎమర్జెన్సీ వినియోగం కోసం ఆమోదం దక్కిందని, ఇప్పుడు తమ దృష్టి మొత్తం ఉత్పత్తి, సరఫరా, పంపిణీపైనే ఉన్నట్లు సీరం, బయోటెక్ ఓనర్లు తెలిపారు. టీకాలు అవసరమైన వారికి సమర్థవంతమైన, సురక్షితమైన వాటిని అందిస్తామన్నారు. మా రెండు కంపెనీలు దేశం కోసం, ప్రపంచ ప్రజల హితం కోసం పనిచేస్తున్నాయని ఇద్దరూ తమ ప్రకటనలో స్పష్టం చేశారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారమే తమ రెండు కంపెనీలు వ్యాక్సిన్ అభివృద్ధి పనులు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన కోవీషీల్డ్ టీకాను సీరం సంస్థ ఇండియాలో ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ టీకాకు భారత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే భారత్ బయోటెక్ సంస్థ రూపొందిస్తున్న కోవాగ్జిన్ టీకాకు కూడా డీసీజీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని పట్ల అభ్యంతరం వ్యక్తం అయ్యింది. మూడవ దశ ట్రయల్స్ పూర్తి కాకుండానే.. కోవాగ్జిన్‌కు ఎలా అనుమతి ఇచ్చారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీరం, భారత్ బయోటెక్ సంస్థ ఓనర్లు ఇవాళ సంయుక్త ప్రకటన చేశారు.

దేశంలో వేగంగా సాగుతున్న అభివృద్ధి

కొచ్చి-మంగళూరు నేచురల్ గ్యాస్ పైప్‌లైన్‌కు శ్రీకారం

వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): మన దేశం అభివృద్ధి వేగాన్ని పెంచిందని, ఇక ఎంత మాత్రం ఈ వేగం మందగించబోదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కొచ్చి-మంగళూరు నేచురల్ గ్యాస్ పైప్‌లైన్‌ను మంగళవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇటీవలి సంవత్సరాల్లో మన దేశం అభివృద్ధి వేగం, విస్తృతి, పరిధులను పెంచిందన్నారు. తదశాబ్దాల్లో భారత దేశ ప్రగతి వేగం వెనుకగల కారణాల గురించి తాను మాట్లాడబోనని తెలిపారు. ఇటీవలి కాలంలో అభివృద్ధి వేగం, విస్తృతి, పరిధులను మన దేశం పెంచిందన్నారు. కొచ్చి-మంగళూరు పైప్‌లైన్ ద్వారా మంగళూరు కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఎ÷-లాంట్‌కు ఇంధనం అందుతుందన్నారు. మంగళూరు ర్గి÷నైరీ అండ్ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్‌కు శుద్ధ ఇంధనాన్ని సరఫరా చేస్తుందన్నారు. సీఎన్‌జీ స్టేషన్లను 10 వేలకు పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. 2014 వరకు కేవలం 25 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు మాత్రమే ఉండేవని, నేడు 72 లక్షలకు పైగా కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. కొచ్చి-మంగళూరు పైప్‌లైన్ వల్ల కేరళ, బెంగళూరుల్లో కాలుష్యం తగ్గుతుందన్నారు. మెరుగైన వాతావరణం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. కాలుష్యం తక్కువగా ఉంటే, నగరాలకు గ్యాస్ ఆధారిత సేవలు అందుబాటులోకి వస్తే, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సహజ వాయువును ఉపయోగించడం వల్ల అనేక పర్యావరణ సంబంధిత ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. భారత దేశ ఎనర్జీ బాస్కెట్‌లో సహజ వాయువు వాటాను 6 శాతం నుంచి 15 శాతానికి పెంచేందుకు తగిన విధానాలను ప్రభుత్వం రూపొందిస్తోందని చెప్పారు. చమురు, సహజ వాయువు రంగంలో ఈ దశాబ్దంలోనే కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెడతామన్నారు. ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా వంట గ్యాస్ దాదాపు ఎనిమిది కోట్ల కుటుంబాలకు చేరుతోందన్నారు. ఎల్‌పీజీ సంబంధిత మౌలిక సదుపాయాలు పటిష్టమైనట్లు తెలిపారు. ఇదిలావుంటే ఒకేదేశం ఒకే గ్రిడ్' లక్ష్యం దిశగా గెయిల్ ఇండియా లిమిటెడ్ నిర్మించిన 450 కిలోమీటర్ల కొచ్చి-మంగళూరు నేచురల్ గ్యాస్ ప్రాజెక్టు కీలకమైన మైలురాయి అవుతుందని పీఎంఓ కార్యాలయం మంగళవారం ఉదయం ఒక ప్రకటనలో తెలిపింది. రూ.3000 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు ఎర్నాకులం, త్రిసూరు, పాలక్కాడ్, మలప్పురం, కోజికోడ్, కన్నూరు, కాసర్‌గాడ్ జిల్లాలను అనుసంధానిస్తుంది. రోజుకు 12 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల రవాణా సామర్థ్యం కలిగి ఉంటుంది. పైప్‌లైన్ నిర్మాణ దశలో 1.2 మిలియన్ 'మ్యాన్-డేస్' ఉపాధి లభ్యమవుతుందని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టు వల్ల పైప్‌లైన్ వెంబడి జిల్లాల్లోని వాణిజ్య, పారిశ్రామిక యూనిట్లకు కూడా సహజ వాయువు సరఫరా చేయగలుగుతామని పేర్కొంది. శుద్ధిచేసిన ఇంధన వినియోగంతో వాయుకాలుష్యం తొలగి వాతావరణ నాణ్యత పెరుగుతుందని కూడా వివరించింది. విద్యుత్ రంగంలో సంస్కరణలు అవసరమని, దేశంలో ఒకే పవర్ గ్రిడ్ ద్వారా రాష్ట్రాలకు తక్కువ ధరకే విద్యుత్‌ను సరఫరా చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2019 కేంద్ర బ్జడెట్‌లో ప్రతిపాదించారు. పవర్ గ్రిడ్ ఏర్పాటుతో దేశంలో ప్రతి ఒక్కరికీ విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆ సందర్భంలో కేంద్ర మంత్రి ప్రకటించారు.

కొవిడ్ వ్యాక్సినేషన్‌కు సిద్ధం

ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ రావు

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): కొవిడ్ వ్యాక్సినేషన్‌కు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. గురు, శుక్రవారాల్లో 1,200 కేంద్రాల్లో డ్రై రన్ నిర్వహిస్తామని తెలిపారు. కొ-విన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికే టీకా వేస్తామని పేర్కొన్నారు. వారానికి నాలుగు రోజులు కొవిడ్ టీకాల పంపిణీ చేపడుతామన్నారు. బుధ, శనివారాల్లో మిగిలిన టీకాల పంపిణీ ఉంటుందన్నారు. వందకు పైగా ప్రయివేటు ఆస్పత్రుల్లో టీకా పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పది రోజుల్లో వ్యాక్సినేషన్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని డాక్టర్ శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. టీకాల కోసం ప్రజలు ముందుగా రిజిస్టర్ చేసుకొనేందుకు కొ-విన్ అనే వెబ్‌సైట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. త్వరలోనే మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తేనున్నది. ఈ రెండు మార్గాల ద్వారా సామాన్యులు నేరుగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ముందుగా కొ-విన్ పోర్టల్ ఓపెన్ చేయగానే రిజిస్ట్రేషన్ అనే ఆప్షన్ వస్తుంది. అందులో ఆధార్ నంబర్ నమోదు చేయాలి. సరైన నంబర్ అయితే వెంటనే మీ పేరు, శాశ్వత చిరునామా తదితర వివరాలన్నీ అందులో కనిపిస్తాయి. ఆ వెంటనే ఆధార్ నంబర్‌తో నమోదై ఉన్న మొబైల్ నంబర్‌కు వన్ టైం పాస్‌వర్డ్ వస్తుంది. దానిని ఎంటర్ చేయాలి. ఆ తర్వాత ఫొటో గుర్తింపు కార్డును అప్‌లోడ్ చేయగానే రిజిస్ట్రేషన్ పూర్తయినట్టు చూపిస్తుంది. ఆధార్ కార్డుపై ఉన్న చిరునామాలు లేనివారు ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా, పుట్టిన తేదీలను స్వయంగా కూడా ఎంటర్ చేయవచ్చు. పూర్తి వివరాలు నమోదు చేసిన తర్వాత 'డెమో అథెంటికేషన్' అనే ఆప్షన్‌ను ఎంపికచేసుకోవాలి. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే ఆకుపచ్చ టిక్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్టు చూపిస్తుంది. రిజిస్ట్రేన్ ప్రక్రియ పూర్తికాగానే ఎప్పుడు? ఎక్కడ? మీకు టీకా వేస్తారు అనే వివరాలతో కూడిన సందేశం మీ మొబైల్ నంబర్‌కు వస్తుంది. కొ-విన్‌లో రిజిస్టర్ చేసుకున్నవారికి మాత్రమే టీకాలు వేస్తారు. నేరుగా టీకా కేంద్రానికి వెళ్లినా వేయరు. ప్రస్తుతం ఈ సాఫ్ట్‌వేర్‌లో ఫ్రంట్‌లైన్ వారియర్స్ వివరాలు మాత్రమే నమోదు చేస్తున్నారు. సామాన్య ప్రజల వివరాల నమోదుపై త్వరలో అధికారికంగా ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎవరికి వారు ఈ పోర్టల్ లేదా యాప్‌లో పేరును స్వచ్ఛందంగా నమోదు చేసుకోవాలి. దానిని బట్టి టీకా వేసే సమయాన్ని కేటాయిస్తారు. ఏయే కేంద్రాల్లో టీకాలు ఎప్పుడు వేయాలి? ఎన్ని సెషన్లలో ఎంతమందికి వేయాలన్న అంశాలను జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయిస్తుంది. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాయంతో కలెక్టర్ టీకా సెషన్‌ను ఖరారు చేస్తారు. టీకా కేంద్రాలు, టీకాలు వేసే సిబ్బంది, సూపర్‌వైజర్లు, టీకా వేసుకొనేవారు ఎవరు అనే విషయాలపై తుది నిర్ణయం కలెక్టర్‌దే. ÷-రభుత్వ, ప్రైవేటు దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను టీకాలు వేసే సెషన్ సైట్‌లుగా ఉపయోగిస్తారు. మారుమూల ప్రాంతాల్లో అయితే పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లను కూడా ఇందుకోసం వాడుకొంటారు. టీకా కేంద్రంలో మూడు గదులు ఉంటాయి. 1. వెయిటింగ్ రూం, 2. వ్యాక్సినేషన్ రూం, 3. అబ్జర్వేషన్ రూం.

కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

. వివిధ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిని సిఎస్ సోమేశ్ కుమార్

ఉద్యోగుల పదోన్నతులపై సమీక్ష

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పదోన్నతులు, కారుణ్య నియామకాలు, ధరణి రిజిస్ట్రేషన్లు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, హరిత వనాలు, ఉపాధి హామీ పనులపై సీఎస్ కలెక్టర్లతో సమీక్షించారు. ఉద్యోగులందరికీ పదోన్నతులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలలో ఎలాంటి జాప్యం జరుగవద్దని చెప్పారు. పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఏర్పడే ఖాళీలను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాలని ఆదేశించారు.

ఉద్రిక్తంగా మారిన రామతీర్థం ధర్మయాత్ర

నెల్లిమర్లకు భారీగా చేరుకున్న కార్యకర్తలు

బిజెపి,జనసేన నేతలను అడ్డుకున్న పోలీసులు

పోలీసులు అడ్డుకోవడంతో కిందపడ్డ సోము వీర్రాజు

వైకాపా, టిడిపిలకు లేని ఆంక్షలు తమపై ఎందుకన్న సోము

పోలీసుల తీరుపై ఆగ్రహం..ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరిక

విజయనగరం,జనవరి5(ఆర్ఎన్ఎ): బీజేపీ, జనసేన నేతలు చేపట్టిన 'రామతీర్థం ధర్మయాత్ర' ఉద్రిక్తతకు దారి తీసింది. రామతీర్థంకు చేరుకుంటున్న బీజేపీ, జనసేన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పలువురు నేతలను అరెస్ట్ చేసారు. ఈ క్రమంలో జనసేన, బీజేపీ నేతలకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు కిందపడిపోయారు. రామతీర్థంకు వస్తున్న బీజేపీ నేతలను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకువెళ్తున్న పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా సోమువీర్రాజు మాట్లడుతూ విగ్రహాల ధ్వంసం విషయంలో సీఎం జగన్, మంత్రుల వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, నియంతృత్వ పోకడలకు పోతున్నారని మండిపడ్డారు. రామతీర్థంలో పోలీసులు సెక్షన్30 అమలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు రామతీర్థం పర్యటన నేపథ్యంలో ఎంపీ విజయసాయిరెడ్డికి ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. జగన్...నిన్ను సీఎం కుర్చీ నుంచి దించే వరకు మేము నిద్రపోమని అంటూ సోమువీర్రాజు శపథం చేశారు. దేవాలయాలపై దాడులు జరుగుతూ ఉంటే జగన్ ఏం చేశారంటూ తీవ్రమైన పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. సోమువీర్రాజును పోలీసులు వలయంగా చుట్టుముట్టారు. అయితే ఎట్టిపరిస్థితుల్లో కూడా తాము రామతీర్థం చేరుకుని తీరుతామని సోమువీర్రాజు స్పష్టం చేశారు. మునుపెన్నుడూ లేని విధంగా సోమువీర్రాజు దూకుడు ప్రదర్శించి, పోలీసులను నిలదీసారు. వైసీపీ ప్రభుత్వ తీరును సోము వీర్రాజు తప్పుబట్టారు. రామతీర్థం సందర్శనకు ధర్మయాత్ర చేపట్టామన్నారు. బీజేపీ నాయకులపై సీఎం జగన్ కక్ష కట్టారన్నారు. రామతీర్థానికి వెళ్లే తమను అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబును సగౌరవంగా రాముడి చెంతకు తీసుకెళ్లారన్నారు. తాము వెళుతుంటే ఎందుకు అడ్డుకుంటారని సోము వీర్రాజు ప్రశ్నించారు. వైసీపీ, టీడీపీ లాలూచీ పడ్డాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఆలయాలపై దాడులకు తెగబడుతున్నాయా అని నిలదీశారు. తమను ఎవరూ అడ్డుకోలేరన్నారు. తాము కూడా రాముడిని దర్శిస్తాము. ధర్మాన్ని కాపాడుకుంటామని సోము వీర్రాజు పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ, జనసేన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న క్రమంలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. మరోవైపు రామతీర్థం ధర్మయాత్రకు వచ్చిన పిఠాపురం, ఏలూరు, విజయవాడ, నెల్లూరు బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తరలించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లే రహదారి అంతా ట్రాఫిక్‌తో స్తంభించింది. ఇదిలావుంటే రాష్ట్రంలో పరిస్థితులు అదుపు తప్పాయని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఇలాగే కొనసాగితే 356 అధికరణ అమలు చేసే పరిస్థితులు వస్తాయన్నారు. ప్రభుత్వం తమను అడ్డుకోవడానికి సెక్షన్ 30 తీసుకొస్తే.. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి 356 అధికరణ ఉందని మర్చిపోవద్దని చెప్పారు. హిందువుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఎం రమేష్ అన్నారు.

తగ్గుముఖం పడుతున్న కేసులు

-కొత్తగా 16,375 కరోనా కేసులు నమోదు

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. కరోనా వ్యాక్సిన్ వస్తుందన్న ఆశతో ఉన్న ప్రజలకు ఇది ఊరట కలిగించే అంశంగా చూడాలి. గడిచిన 24 గంటల్లో దేశంలో 16,375 కరోనా కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ మంగళవారం తెలిపింది. మహమ్మారి నుంచి 29,091 మంది తాజాగా కోలుకొని హాస్పిటళ్ల నుంచి డిశ్చార్జి అయ్యారని, వైరస్ ప్రభావంతో మరో 201 మంది మృత్యువాత పడ్డారని పేర్కొంది. కొత్తగా నమోదైన కేసులతో దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య 1,0 3,56,845కు చేరగా.. ప్రస్తుతం దేశంలో 2,31,036 యాక్టివ్ కేసులున్నాయని తెలిపింది. వైరస్ నుంచి 99,75,958 కోలుకున్నారని, మహమ్మారితో ఇప్పటి వరకు 1,49,850 మంది మృత్యువాతపడ్డారని వివరించింది. ఇదిలా ఉండగా.. సోమవా రం ఒకే రోజు దేశవ్యాప్తంగా 8,96,236 శాంపిల్స్ పరీక్షించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ పేర్కొంది. ఇప్పటి వరకు 17,65,31,997 నమూనాలను పరీక్షించినట్లు వివరించింది.

కరోనా పేషెంట్‌కు కానిస్టేబుల్ ప్లాస్మా దానం

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): పోలీసులు అంటే చట్ట వ్యతిరేక పనులు చేస్తే దండించడమే కాదు ఆపదలో ఉన్న సమయంలో ఆదుకోవడంలో కూడా ముందుంటున్నారు.గత 5 రోజులుగా హయత్ నగర్ కు చెందిన 75ఏళ్ల వృద్ధురాలు శ్రీదేవమ్మ కరోన భారిన పడి లంగ్స్ ఇన్ఫెక్షన్ తో బాదపడుతూ మలక్ పెట్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వైద్యులు అత్యవసరంగా బీ పాజిటివ్ ప్లాస్మా అవసరమని చెప్పడంతో స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సురేందర్ వెంటనే స్పందించి ప్లాస్మా డొనేట్ చేశాడు. సురేందర్ ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సరూర్ నగర్ పిఎస్‌లో పని చేస్తున్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్రీదేవమ్మ ప్లాస్మా ఎక్కించడంతో కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. కానిస్టేబుల్ సురేందర్ కు పేషెంట్ తరపు బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

సైకిల్‌పై కరోనా వ

ప్రతిష్టంభన తొలగించే ప్రయత్నం చేయాలి !

నేటినిజం
బుధవారం 6-1-2021

సంక్రాంతి దగ్గర పడుతోంది. దేశంలో ఎక్కడైనా రైతుల పండుగను వివిధ రూపాల్లో జరుపుకుంటారు. ఈ దశలో ఇంకా వీరు తమ ఆందోళన కొనసాగించాలనుకోడం సరికాదు. తెగేదాకా లాగడం ఎవరికి కూడా సరికాదు. దాదాపు రెండు నెలలుగా ఆందోళన చేస్తున్న రైతులు ఢిల్లీ సమీపంలో చల్లటి చలిలో మగ్గు తున్నారు. ఇది ఎంతమాత్రం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. రైతులు కూడా ఒకింత ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. అగ్రి చట్టాలతో మంచే జరుగుతుందని ప్రభుత్వం చేస్తున్నది. రైతులేమో తమకు ఉరితాళ్లు అంటున్నారు. ఈ సమస్యలపై రైతులు నిపుణులను ఆహ్వానించి చర్చించాలి. మొండిగా ముందుకు వెళితే నష్టపోయేది రైతులే. రైతుల మేలుకోరి చట్టాలు చేసినప్పుడు వాటిపై చర్చించడంలో తప్పులేదు. ఈ దశలో వరుసగా ఏడోవిడత చర్చలు కూడా విఫలం అయ్యాయి. అయితే ప్రతిష్టంభన కొనసాగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అటురైతులపై ఇటు ప్రభుత్వంతో పాటు విపక్షాలపైనా ఉంది.

రైతుల ఆందోళనలతో చలిమంటలు కాచుకోవాలనకుంటున్న విపక్ష పార్టీల నేతలు మళ్లీ పత్తా లేకుండా పోయారు. ఈ దశలో చర్చల సందర్భంగా కేంద్రం మెట్టు దిగిరావడం లేదు .. రైతులు పట్టువీడడం లేదు.. ఫలితంగా కొత్త సాగు చట్టాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఇకపోతే ఢిల్లీ సరిహద్దులో నిరసనల కారణంగా గాజియాబాద్, నోయిడా నుంచి రాజధానికి వెళ్లే రహదారులు దిగ్బంధం లోనే కొనసాగు తున్నాయి. 40 రోజులుగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో..దిల్లీ ట్రాఫిక్ పోలీసు విభాగం ట్విటర్ ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేస్తోంది. రైతుల డిమాండ్లు అన్నిటిని ఆమోదించాలని దిల్లీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్ ట్వీట్‌లో కేంద్రానికి సూచించారు. సాగు చట్టాలపై కేంద్ర ప్రభుత్వం, రైతు సంఘాల మధ్య చర్చలు మరోసారి విఫలం కావడంతో ఢిల్లీని వీడి వెళ్లేది లేదని రైతులు మొడికేసారు. వివాదాస్పద చట్టాలను రద్దు చేయాల్సిందేనని అన్నదాతలు పట్టుబట్టారు. దీంతో చర్చల్లో ఎలాంటి పురోగతి రాలేదు. మరోవైపు కొత్త చట్టాలను రద్దు చేయబోం అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ స్పష్టంగా చెప్పారు. కావాలంటే ఈ అంశంపై మీరు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించొచ్చని మంత్రి అన్నారు. అయితే తమ డిమాండ్లు నెరవేరేవరకు తాము దిల్లీని వీడేదిలేదని, గణతంత్ర దినోత్సవం నాడు భారీ ర్యాలీ చేపట్టనున్నామని చెప్పారు. దీంతో రానున్న రోజుల్లో సంక్రాంతి ఎలా ఉన్నా గణతంత్ర వేడుకలపై తీవ్ర ప్రభావం పడనుంది. కేంద్ర ప్రభుత్వం, 41 రైతు సంఘాల మధ్య సోమవారం జరిగిన ఏడో విడత చర్చలూ విఫలమవ్వడం వల్ల సమస్య కొలిక్కి వస్తుందా అన్న అనుమానాలు మొదలయ్యాయి. వ్యవసాయరంగానికి నూతన సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయంటూ ప్రధాని మోడీ పదేపదే చెబుతు న్నారు. ఓ ఏడాది, రెండేళ్లు వీటిని అమలు చేస్తే ఫలితం ఉంటుందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అసలు కార్పోరేట్ వ్యవసాయ ఆలోచన చేలదని రిలయన్స్ చెబుతోంది. ప్రపంచమంతా కార్పోరేటీకరణ జరిగి గుండుసూది నుంచి సెల్ ఫోన్ వరకు కార్పోరేట్లు తయారు చేస్తున్నప్పుడు వ్యయసాయ కార్పోరేటీకరణ అంటూ విపక్షాలు గగ్గోలు చేయడం సరికాదు. నిజానికి ఇప్పుడు కావాల్సింది పంటలను మద్దతు ధరలతో కొని రైతులకు అండగా నిలవడమే ముఖ్యం. చట్టాలతో పలు ఉపయోగాలు ఉన్నాయంటూ చర్చల్లో మంత్రుల బృందం ఏకరవు పెట్టగా... వివాదాస్పద చట్టాలను రద్దు చేయాల్సిందే నని రైతు నేతలు భీష్మించారు. దీంతో చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అయితే, ఈ నెల 8న మరోసారి సమావేశం కావాలనే విషయంలో రెండు పక్షాలూ ఏకాభిప్రాయానికి వచ్చాయి. ప్రభుత్వ బృందానికి నేతృత్వం వహించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తదుపరి విడత భేటీపై ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల నుంచి సమస్య పరిష్కారం దిశగా కృషి జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. చట్టంలోని ప్రతి క్లాజు వారీగా చర్చ జరగాలని ప్రభుత్వం సూచించిం దని వెల్లడించారు. రైతు నేతలు మొండి వైఖరిని వీడకపోయినప్పటికీ మొత్తం మీద చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయన్నారు. పరిష్కారం కనుగొనాలని రెండు పక్షాలూ ప్రయత్నిస్తున్నాయని తోమర్ తెలిపారు. సాధ్యమైనన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలించటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ తర్వాత వెలువడిన అధికార ప్రకటన పేర్కొంది. ప్రభుత్వ అహం వల్లే చర్చలు మరోసారి విఫలయ్యాయని రైతు సంఘాల నేతలు ఆరోపించారు. కొత్త సాగు చట్టాలను రద్దు చేయాల్సిందేనని, కనీస మద్దతుధర వ్యవస్థ కొనసాగిం పుపై చట్టబద్ధ హామీ కావాల్సిందేనని మంత్రుల బృందానికి మరోసారి గట్టిగా చెప్పామని భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు బల్బీర్ సింగ్ పేర్కొన్నారు. తమ ఎజెండాకే కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది. మరోవైపు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీ సరిహద్దుల్లో అన్నదాతల ఆందోళన కొనసాగుతోంది. దేశ రాజధానిలో ఆదివారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్నా రైతులు ఏ మాత్రం సడలకుండా నిరసనలు సాగిస్తున్నారు. అటు ఆందోళనల కారణంగా సరిహద్దు రహదారులు ఇంకా దిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు వాహన దారులకు సూచిస్తున్నారు. ఢిల్లీలో ఉన్న చలి వాతావరణం దృష్ట్యా రైతులతో ప్రభుత్వం రోజువారీ చర్చలు జరపాలి. అన్నదాతలు తమ డిమాండ్లు ఏంటో స్పష్టంగా చెప్పాలి. కేవలం చట్టాలను రద్దు చేయాలని అనకుండా తమకు ఎలాంటి వెసలుబాట్లు కావాలో చెప్పాలి. ఇదే సందర్భంలో రైతుల సమస్యలపై చర్చించి సాధించుకోవడం మంచిది. విపక్షాలు లేదా వ్యవసాయరంగ నిపుణులు బహిరంగ చర్చలతో సమస్యలకు పరిష్కారం కనుగొనాలి. రైతులకు, ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేయాలి.

సేంద్రీయ ఎరువులతో సేద్యం చేయాలి

సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచన

సంగారెడ్డి,జనవరి5 (నేటినిజం ప్రతినిధి):: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మట్టిలో పోషకాలను పెంచేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయా అధికారులు పిలుపునిచ్చారు. రసాయన ఎరువుల వినియోగం పెరిగి భూమికి తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. అన్నదాతలు ఈ విషయాన్ని గుర్తించి రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. రైతన్నలు మట్టిని కాపాడితే సమాజాన్ని కాపాడినవారు అవుతారన్నారు. అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం కోల్పోయి పంట నాణ్యత హీనంగా వస్తుందన్నారు. తద్వారా ఆ పంటను స్వీకరించిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు,. వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయించుకుని రైతులు తమ పోలాల్లో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోవచ్చన్నారు. అవసరమైనంత మేరకు సత్రజని పోటాష్‌లు, వినియోగించాలన్నారు అంతేకాకుండా భూమి యొక్క బౌతిక రసాయన స్థితిని బట్టి ఆభూమిలో ఏఏ పంటలు పండుతాయి అనే విషయాన్ని కూడా తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. అధిక మొత్తంలో రసాయనాలు వాడి భూమిలోని పోషకాలు తగ్గించకుండా భూమిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం రైతులపై ఉందన్నారు. భూసారం తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగానే తెలుసుకుని వాటిని అవలంబించాలన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన పంటు పండే అవకాశం ఉందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలను భూమి ఇస్తుందని భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్మికంపోస్ట్ సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. ఇదిలావుంటే మండల స్థాయిలో, గ్రామీణ స్థాయిలో కూడా ప్రైవేట్ వ్యక్తులు మట్టి తవ్వేందుకు ప్రయత్నాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను అధికారులను పాటించాలన్నారు.

మత్స్యకారుల్లో పెరిగిన భరోసా

ఫలితాలు ఇస్తున్న చేపపిల్లల పెంపకం

మెదక్,జనవరి5(ఆర్ఎన్ఎ): ఉమ్మడి పాలనలో తెలంగాణలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ఎలాంటి కృషి జరగలేదని స్థానిక మత్స్య పారిశ్రామిక సంఘం నేతలు అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా ఉచితంగా చేపపిల్లను అందించడం జరిగిందన్నారు. ఆధునిక పద్ధతిలో చేపలను పెంచేందుకు వీలుగా కేజ్ కల్చర్ సాగును అందుబాటులోకి తీసుకరావడం జరిగిందన్నారు. జిల్లాలో మున్ముందు చేపల ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంతకాలం దళారుల ప్రమేయంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న కార్మికుల కుటుంబాలలో తెలంగాణ ప్రభుత్వం నూతన సంవత్సరం వేళ కొత్త కాంతులు నింపిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కార్మికులు ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో మత్స్య పరిశ్రమకు వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో మరిన్ని నిధులను పెంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే ఇచ్చే బీమా పరిహారం రూ 6లక్షలకు పెంచుతామని చెప్పడం భరోసా కల్పించిందని పేర్కొన్నారు. మఖ్యమంత్రికి మత్స్యకార్మికులు ఎప్పటికి రుణపడి ఉంటారన్నారు. 50 ఏళ్లపైబడిన కార్మికులకు పింఛన్, పక్కా ఇళ్లు, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య సౌకర్యం కల్పించే విధంగా చూడాలని కోరారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి మత్స్యవృత్తిని కాపాడుకుంటూ వస్తున్న కార్మికులకు టీఆర్ఎస్ ప్రభుత్వం భరోసా ఇవ్వడం పట్ల కార్మికుల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

వర్మీకంపోస్టుతో కూరగాయల సాగు

వరంగల్,జనవరి5(ఆర్ఎన్ఎ): వరంగల్ రూరల్ జిల్లాకు వర్మికంపోస్ట్ యూనిట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వర్మికంపోస్టు యూనిట్లు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యాన పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడేందుకు ప్రభుత్వం రాయితీపై వర్మీకంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రధానంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయల పంటలలో రసాయనాల వాడకం తగ్గించడం ద్వారా ప్రజలకు మేలైన కూరగాయలు అందేలా చేయాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగులో కంపోస్టు ఎరువుల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ముందుగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన రైతులకు రాయితీపై వర్మికంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఉద్యానశాఖ అధికారి తెలిపారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలు

కరీంనగర్,జనవరి5 (నేటినిజం ప్రతినిధి):: దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో బృహత్తరమైన పథకాలు ప్రవేశపెట్టి ఏ ప్రభుత్వమూ ఎన్నడూ చేయని అభివృద్ధిని సిఎం కెసిఆర్ చేసి చూపుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వివరించారు. ఒక వైపు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, నిరుపేదలకు భూములు, రైతుల పంటలకు రూ.10 వేలు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాల్లో దళితులకు పెద్దపీట వేస్తూ వారికి సహకారం అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వాల కాలంలో 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసే వారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో సబ్సిడీని 80 శాతానికి పెంచారని గుర్తుచేశారు.

నిబంధనల మేరకు మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి

నిజామాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): నాణ్యత లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే మరుగుదొడ్లకు వాటికి బిల్లుల చెల్లింపు ఉండదని అధికారులు హెచ్చరించారు. జిల్లాలో అన్నిగ్రామాల్లో వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని జిల్లా పరిషత్తు సీఈవో అన్నారు. అన్ని గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏయే గ్రామంలో ఏ స్థాయిలో మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇసుక కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందని సీఈవో దృష్టికి తీసుకురావడంతో ఐహెచ్‌హెచ్ఎల్ నిర్మాణాలకు అనుమతి ద్వారా తరలిస్తున్న ఇసుక పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులదేనన్నారు. నిర్దేశిత సమయంలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. 80 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయిన గ్రామాలను గుర్తించి మిగిలిన 20 శాతం పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. గ్రామాల్లో నిర్మాణాలు వెనుకబడి ఉండటంపై కార్యదర్శులను మందలించారు.

వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న పువ్వాడ

రానున్న ఖమ్మం కార్పోరేషన్ కోసం ఎత్తుగడలు
అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలను ఆకట్టుకునే యత్నాలు

ఖమ్మం,జనవరి5(ఆర్ఎన్ఎ): ఖమ్మంపై పట్టు నిలుపుకునేందుకు మంత్రి పువ్వాడ అజయ్ వ్యూహాత్మకంగా అడుగుల వేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తేవడం, దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపడం లాంటి అంశాలపై టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు ప్రయత్ని స్తున్నారు. పట్టణ నేతలను కలుపుకుని పర్యటిస్తూ ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇటీవల ఐటి టవర్స్‌ను ప్రారంభించి యువతకు ఆశ చూపారు. అలాగే సీనియర్లను మచ్చిక చేసుకుని కలుపుకుని పోవాలని చూస్తున్నారు. ఖమ్మం పీఠంపై టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ గురిపెట్టి కార్యాచరణ రూపొందిస్తున్న వేళ.. వామపక్షాలు, టీడీపీ తమ వ్యూహాలపై అంతర్గత సమాలోచనలు చేసుకుంటున్నాయి. కుదిరితే పొత్తులు పెట్టుకోవాలని, లేదంటే ఎవరికివారు మొత్తం సీట్లలో పోటీకి దిగాలని సీపీఎం, సీపీఐ, టీడీపీ యోచిస్తున్నాయి. సీపీఎం, సీపీఐ పొత్తుల విషయమై టీఆర్ఎస్‌తో అంతర్గతంగా చర్చలు జరుపుతున్నాయని తెలుస్తోంది. అయితే టీఆర్ఎస్ ఇచ్చే సీట్లను బట్టి పొత్తుల చర్చలు ఫలించే అవకాశం ఉంది. లేదంటే వామపక్షాలు, కాంగ్రెస్‌తో జతకట్టే అవకాశం లేకపోలేదు. గతంలో బలంగా ఉన్న సీపీఎం,సీపీఐలు దెబ్బతినడం, గత ఎన్నికల్లో చేరో రెండుస్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఇక తెలుగుదేశంలో రాజకీయ పరిణామాలు స్తబ్దుగా కనిపిస్తున్నాయి. అన్నిచోట్ల పోటీచేయాలని శ్రేణులు ఉత్సాహం చూపుతున్నా.. గ్రేటర్ తరహా ఫలితాలు ఎదురయ్యే అవకాశం ఉంటే పరిస్థితేంటా అన్న చర్చలు జరుగుతున్నాయి. అలాగని అటు కాంగ్రెస్, ఇటు బీజేపీతో జట్టు కట్టే పరిస్థితి కనిపించడం లేదు. ఒక వేళ కాంగ్రెస్, వామపక్షాలు కూటమిగా ఏర్పడితే ఆ కూటమిలో చేరేందుకు టీడీపీ సమాయత్తమవుతోందని తెలుస్తోంది. నగరంలో టీడీపీకి ఓటు బ్యాంకు ఉన్నా నాయకత్వ సమస్య కనిపిస్తోంది. ఉన్ననాయకుల మధ్య ఐక్యత లేదని, ఎవరికివారే అన్నట్లుగా వ్యహరిస్తున్నారని, ఈ సమయంలో ఎన్నికల వ్యూహం ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే పురపాలక శాఖ మంత్రి కేటీఆర్.. ఇటీవల జిల్లాకు వచ్చిన సమయంలో మంత్రి పువ్వాడ అజయ్ వినతితో ఇచ్చిన హామీ మేరకు రహదారుల కోసం రూ.30కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే రూ.25కోట్లతో నగరంలో రోడ్ల విస్తరణ, డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు లాంటి పనులు జరుగుతున్నాయి. శ్రీశ్రీ సర్కిల్‌నుంచి వెంకటాయపాలెం వరకు నాలుగులైన్ల రహదారికి ప్రతిపాదనలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ ఎన్నికల నాటికి నగర అభివృద్ధిని మరింత పరిగెత్తించేలా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా డబుల్ ఇళ్ల పంపిణీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు మంత్రి కేటీఆర్ మరోసారి ఖమ్మం రాబోతున్నట్లు సమాచారం. మరో వైపు టీఆర్ఎస్.. సీనియర్ నాయకులను 5డివిజన్లకో ఇన్‌చార్జ్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయా డివిజన్ కమిటీల సమావేశాలు నిర్వహిస్తున్నారు. నగర పరిధిలోని డివిజన్లలో ఓటుబ్యాంకు ఉన్న నేతలు, కుల సంఘాలు, ఇతర సామాజిక సంఘాల జాబితాను సిద్ధం చేస్తున్నారు. డివిజన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ విపక్ష కాంగ్రెస్, బీజేపీలపై మాటల తూటాలు పేలుస్తున్నారు. దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో ఖమ్మంలో ఖచ్చితంగా గెలవాలని, అందుకు అనుసరించాల్సిన పటిష్ట వ్యూహాలను రూపొందించడంపై టీఆర్ఎస్ రాష్ట్ర నేతలతోపాటు మంత్రి పువ్వాడ దృష్టిపెట్టారు. ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు కూడా రంగంలోకి దిగనున్నారు. అయితే గత ఎన్నికల్లో ఒంటరిగా బరిలో దిగిన టీఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను దక్కించుకోగా.. ఈసారి కలిసివస్తే వామపక్షాలతో సర్దుబాటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సీపీఎం, సీపీఐ నేతలతో చర్చలు సాగుతున్నాయన్న ప్రచారం జరుగుతుంది.

ప్రతిష్టాత్మకం కానున్న కార్పోరేషన్ ఎన్నికలు

పోరాట కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న బిజెపి
సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేసే ప్రయత్నాల్లో టిఆర్ఎస్

వరంగల్,జనవరి5(ఆర్ఎన్ఎ): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల ప్రచారాన్ని టీఆర్ఎస్ నాయకులు పరోక్షంగా చేపట్టారు. ఏ కార్యక్రమం జరిగినా టిఆర్ఎస్ సంక్షేమపథకాలను గుర్తు చేస్తూ కార్యక్రమంలో అట్టహాసంగా చెబుతున్నారు. మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ సహా ఎమ్మెల్యేలు కార్పోరేషన్ పరిధిలో జోరుగా తిరుగుతున్నారు. నాయకులు, వార్డుల్లో పోటీచేయాలనుకుంటున్న అభ్యర్థులు, కార్యకర్తలు మున్సిపల్ పరిధిలో పరోక్షంగా విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీఆర్ఎస్ నాయకులు పడ్డపుంది ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. పలు వార్డుల్లో పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారు ఆయా వార్డుల్లో తమవంతుగా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆరేళ్లుగా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కెసిఆర్ పాలనను ఆకాశానికి ఎత్తుతున్నారు. అయితే ఇటీవల వరంగల్ వరదలు వారిని వెన్నాడుతున్నాయి. డబుల్ ఇళ్ల హామీ ఇంకా నెరవేరలేదు. ఇదే తరుణంలో బిజెపి కూడా దూకుడుగా ఉంది. వివిధ అంవాలపై ఆందోళనలను ఉధృతం చేస్తోంది. కలెక్టరేట్ల ముందు ధర్నాలు, వివిధ హామీలపై ఆందోళనలతో ప్రజల్లోకి చొచ్చుకుని పోతోంది. వివిధ సమస్యలపై కొన్ని రోజులుగా బీజేపీ, ఏబీవీపీ, బీజేవైఎం, ఎస్సీ మోర్చా నాయకులు వరుస ఆందోళనలతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపే యత్నాలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున చేరికలకు కసరత్తు జరుపుతున్నారు. పార్టీ అధ్యక్షుడి సమక్షంలో పెద్ద ఎత్తున చేరికలు జరిగేలా సిద్ధం చేశారు. సంజయ్ నగర పర్యటనతో పార్టీకి మరింత ఊపు లభించనున్నది. మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రోడ్లు, మురికికాల్వలు, ఇతర పనులను స్థానికులకు తెలియజేయడం ద్వారా టిఆర్ఎస్ నేతలు పరోక్ష ప్రచారంలో ఉన్నారు. టీఆర్ఎస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయని, తమ ఉపాధి ఎంతగానో మెరుగుపడిందని ప్రజలు టీఆర్ఎస్ నాయకులకు వివరిస్తు న్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రూ.1కిలో బియ్యం, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేసీఆర్ కిట్, అమ్మఒడి లాంటి పథకాలతో పట్టణంలో అర్హులైన వారందరికి వర్తింప చేశామని చెబుతున్నారు.

పలు వార్డుల్లో నాయకులు ప్రచారంలా కాకుండా ప్రజలను కలుసుకునే యత్నాలు చేస్తుండగా వివిధ వార్డుల్లో టీఆర్ఎస్ ఆశావహ అభ్యర్థులు సైతం తమ అనుచరులతో వీధుల్లో తిరుగుతూ గడప గడపకు వెళ్లి పలకరింపులు మొదలు పెట్టారు.

సాగర్ లెక్కలు తీస్తున్న బిజెపి

అందరికన్నా ముందే ప్రచార రంగంలో నేతలు
గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణుల దూకుడు

నల్లగొండ,జనవరి5(ఆర్ఎన్ఎ): అభ్యర్థి ఎవరైనా గెలుపే ముఖ్యం..ఇదే సూత్రంతో బిజెపి ముందుడుగు వేస్తోంది. ఈ లక్ష్యంతో నాగార్జునసాగర్ ఉప ఎన్నికపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ ఎన్నికల ఫలితాలతో జోష్‌లో ఉన్న ఆ పార్టీకి సాగర్‌లో ఇద్దరు అభ్యర్థులు పోటీపడుతుండటం, ఎవరికి వారుగా ప్రచారం నిర్వహిస్తుండటంతో శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అభ్యర్థి ఎవరైనా గెలుపు బిజెపిదే కావాలన్న లక్ష్యంతో పార్టీ నేతలు ముందకు సాగుతున్నారు. అదే రకంగా ప్రచారం చేస్తున్నారు.

ఓటర్ల జాబితాను ముందేసుకుని ఆరా తీస్తున్నారు. ఏయే వర్గాలు..ఎవరి వల్ల వింటూరన్న లెక్కలు తీస్తున్నారు. కాగా, సాగర్ నియోజకవర్గం టికెట్‌ను ఆశిస్తున్న కంకణాల దంపతులు, కడారి అంజయ్య యాదవ్ ఎవరికి వారు ప్రచారం నిర్వహిస్తున్నారు. వారం రోజుల్లో పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, ఇరువురు ఆశావహులను సమన్వయం చేసి అంతిమంగా బీజేపీని గెలిపించేలా ప్రచారం చేయడంతోపాటు, పార్టీ శ్రేణుల్లో గందరగోళాన్ని తొలగించడం సమన్వయకర్తల ముందున్న సవాల్. ప్రస్తుతం పార్టీ సంస్థాగతంగా బలహీనంగా ఉంది. పోటీ చేసేందుకు ఇద్దరు ఆశావహులు ఉవ్విళ్లూరుతున్నారు. అభ్యర్థి ఎవరనేది ఇప్పట్లో తేలే పరిస్థితి లేదు. ఆశావహుల సమన్వయం, పార్టీని బూత్ వారీగా బలోపేతం చేయడం సమన్వయకర్తల లక్ష్యం. దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల్లో లాగా సాగర్‌లోనూ గెలుపొందాలనేది బీజేపీ లక్ష్యం. కాంగ్రెస్‌లో 19 మంది గెలిస్తే 13 మంది పార్టీ మారారని, కాంగ్రెస్, టీఆర్ఎస్ ఒకే గూటి పక్షులంటూ బీజేపీ ప్రచారం చేయనుంది. రాష్ట్రం కోసం బలిదానం చేసిన కుటుంబాలను టీఆర్ఎస్ పట్టించుకోక పోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం వంటి అంశాలను బీజేపీ ప్రధాన ఎజెండాగా తీసుకోనుంది. అంతేగాక గ్రేటర్ ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను దూరంగా పెట్టడాన్ని కూడా ఆ వర్గాల్లో బలంగా తీసుకెళ్లాలని బీజేపీ చూస్తోంది. గందరగోళం ఏర్పడకుండా అన్ని పార్టీలకంటే ప్రచారంలో ముందుండి ఫలితం సాధించాలని బీజేపీ చూస్తోంది. అందుకు ఉప ఎన్నిక సమన్వయకర్తలుగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంకినేని వెంకటేశ్వరరావు, వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డిలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిర్ణయం తీసుకున్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం, టీడీపీ, బీజేపీలో సంకినేని అందించిన సేవలను పరిగణనలోకి తీసుకొని ఆయన్ను ఉప ఎన్నిక కో-ఆర్డి నేటర్‌గా ఖరారు చేశారు. పక్షపాతానికి త

బయోటెక్ వ్యాక్సిన్‌పై దుష్ప్రచారమా?

మా పరిశోధనలపై అనుమానాలు

ప్రపంచ జర్నల్స్‌లో మా పరిశోధనలకు చోటు

విమర్శలకు దృటుగా సమాధానం ఇచ్చిన చైర్మన్ కృష్ణ ఎల్లా

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): భారత్ బయోటెక్ వ్యాక్సిన్‌పై దుష్ప్రచారాలు చయడం తగదని భారత్‌బయోటెక్ సంస్థ చైర్మన్ కృష్ణ ఎల్లా మీడియాతో అన్నారు. తమ వ్యాక్సిన్‌ను నీటితో పోల్చడం తగదన్నారు. భారత్ బయోటెక్ సంస్థ తయారు చేసిన కోవిడ్ టీకా కోవాగ్జిన్ వినియోగం కోసం కేంద్ర ప్రభుత్వం ఆమోదం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విపక్షాలు ఆ వ్యాక్సిన్ సమర్థతపై అనుమానాలు వ్యక్తం చేశాయి. ఎటువంటి డేటా ఇవ్వకుండా కోవాగ్జిన్ టీకాకు ఎలా అనుమతి ఇస్తారని విపక్షాలు నిలదీశాయి. ఈ సందర్భంగా భారత్‌బయోటెక్ సంస్థ చైర్మన్ కృష్ణ ఎల్లా మీడియాతో మాట్లాడుతూ తమ సంస్థకు అనుభవం లేదని ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. తమది గ్లోబల్ కంపెనీ అని, ఇప్పటికే అనేక రకాల వ్యాక్సిన్లను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. తమ కంపెనీ ఇప్పటి వరకు 16 రకాల టీకాలను తయారు చేసినట్లు కృష్ణ ఎల్లా చెప్పారు. వాస్తవానికి కోవాగ్జిన్ మూడవ దశ ట్రయల్స్ జరుగుతున్నాయి. కానీ ఆ టీకాకు సడన్‌గా అనుమతి ఇవ్వడం పట్ల వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో వివరణ ఇచ్చిన చైర్మన్ కృష్ణ ఎల్లా.. తమ సంస్థ ప్రపంచ దేశాల కోసం టీకాలను తయారు చేస్తుందన్నారు. కేవలం భారత్‌లో మాత్రమే తమ టీకాలను వాడరన్నారు. కోవాగ్జిన్ కోసం బ్రిటన్‌లోనూ ట్రయల్స్ జరిగాయన్నారు. డేటా అంశంలో పారదర్శకంగా లేమని చెప్పడం అసత్యమని ఆయన అన్నారు. కోవాగ్జిన్‌కు ఎమర్జెన్సీ ఆమోదం దక్కడం ఓ గొప్ప సంకేతమన్నారు. భారత్ అభివృద్ధి చేసిన ఉత్పత్తికి ఇది అరుదైన ఘనత అని అన్నారు. దేశం గర్వించదగ్గ సందర్భమని, భారత శాస్త్రీయ సామర్థ్యంలో ఇదో మైలురాయి అని కృష్ణ ఎల్ల తెలిపారు. ఇన్వేషన్ వాతావరణ కల్పనకు ఇది ఆరంభం అన్నారు. మహమ్మారి వేళ వ్యాక్సిన్‌తో వైద్య అవసరాలను తీర్చాలని, ప్రపంచ వ్యాప్తంగా అవసరమైన వారికి తమ వ్యాక్సిన్ అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని ఎల్ల తెలిపారు. కోవాగ్జిన్ టీకా అత్యంత సురక్షితమైందని, ఆ టీకాతో రోగనిరోధక శక్తి కూడా ఘణనీయంగా పెరుగుతోందన్నారు. అయితే మనవాళ్లు వ్యాక్సిన్‌పై రాజకీయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తమ కుటుంబానికి చెందిన ఒక్కరు కూడా ఎటువంటి రాజకీయ పార్టీతో లింకులో లేరన్నారు. తాము కేవలం ఇండియాలో మాత్రమే క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం లేదని, బ్రిటన్‌తో పాటు 12 దేశాల్లో క్లినికల్ ట్రయల్స్ చేశామని, పాకిస్థాన్, నేపల్, బంగ్లాదేశ్ లాంటి దేశాల్లోనూ తమ టీకా ట్రయల్స్ జరిగినట్లు ఎల్ల వెల్లడించారు. మాది కేవలం ఇండియన్ కంపెనీ మాత్రమే కాదు, మాది నిజమైన గ్లోబల్ కంపెనీ అని భారత్ బయోటెక్ ఎండీ తెలిపారు. తమ కంపెనీకి వ్యాక్సిన్ ఉత్పత్తిలో అపార అనుభవం ఉన్నట్లు కృష్ణ ఎల్ల తెలిపారు. వ్యాక్సిన్ ఉత్పత్తిలో తమకు అనుభవం లేదని చెప్పడం శోచనీయమన్నారు. 123 దేశాల్లో తమ వ్యాక్సిన్ ఉత్పత్తులను వాడుతున్నట్లు ఆయన తెలిపారు. తమ కంపెనీకి చాలా విస్తృతమైన అనుభవం ఉందని, సైంటిఫిక్ జర్నల్స్‌లోనూ తమకు గుర్తింపు ఉన్నట్లు ఎల్ల తెలిపారు. కోవాగ్జిన్ డేటా విషయంలో పారదర్శకంగా లేరని తమపై ఆరోపణలు వస్తున్నాయని, ఓపిక ఉన్న వాళ్లు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేస్తే, తాము ఎన్ని నివేదికలు రాశామో అర్థం అవుతుందన్నారు. అంతర్జాతీయ పత్రికల్లో సుమారు 70 ఆర్టికల్స్ వచ్చినట్లు కృష్ణ ఎల్ల తెలిపారు.

ఇదిలావుంటే రాష్ట్రంలో కరోనా వ్యాక్సిన్ సరఫరాకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలో 10 వేల సెంటర్లలో వ్యాక్సిన్ పంపిణీకి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఫ్రీజర్స్, కూలర్లలో కోటిన్నర వ్యాక్సిన్లు స్టోరేజ్ చేయొచ్చు. త్వరలో కొనబోయే వాటిలో మరో కోటిన్నర వ్యాక్సిన్లు నిల్వ చేసే అవకాశం ఉంది. కోవిషిల్డ్ వ్యాక్సిన్ అయితే ఇన్సులేటెడ్ కార్గో విమానాలలో రాష్ట్రానికి రానుంది. భారత్ బయోటెక్ కోవాగ్జిన్ ను ఇన్సులేటెడ్ వాహనాల్లో సరఫరా చేయనున్నారు. మొదట స్టేట్ వ్యాక్సినేషన్ సెంటర్ కు చేరుకున్న తర్వాత.. రీజనల్ వ్యాక్సిన్ సెంటర్లకు వ్యాక్సిన్ సరఫరా చేయనున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్ కు పంపనున్నారు. ప్రస్తుతం 17 ఇన్సులేటెడ్ వాహనాలు ఉన్నాయి. మరో 19 వెహికల్స్ కొనుగోలు చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. 40క్యూబిక్ మీటర్స్ సామర్థ్యం ఉన్న నాలుగు వాక్ ఇన్ కూలర్స్ ? 20క్యూబిక్ మీటర్ల సామర్థ్యం ఉన్న ఆరు వాక్ ఇన్ ఫ్రీజర్లను కొనుగోలు చేస్తున్నారు. రెండువారాల్లో కూలర్లు, ఫ్రీజర్లు, ఇన్సులేటెడ్ వెహికల్స్ అందుబాటులోకి రానున్నాయి.

మిర్చి రైతులకు స్టోరేజీ సౌకర్యం

అప్పుడే గిట్టుబాటు ధరలకు అనుకూలం

గుంటూరు,జనవరి5(ఆర్ఎన్ఎ): మిర్చి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గిపోతుందని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుందామంటే వాటి యజమానులు కూడా ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచారని జిల్లా రైతు సంఘం కార్యదర్శి రాధాకృష్ణ విమర్శించారు. కు అక్రమంగా వసూళ్లు చేస్తున్నా అధికారులు, పాలకవర్గం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధిక కమీషన్, మచ్చుల పేరుతో మిర్చియార్డులో అధిక వసూళ్ల దోపిడీని అరికట్టాలని అన్నారు. ఇప్పటినుంచే చర్యలు తీసుకుని వచ్చే మార్కెట్ నాటికి పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సన్న, చిన్నకారు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, మార్క్‌ఫెడ్‌కు వేయి కోట్లు కేటాయించి కొనుగోళు ప్రారంభించాలని అన్నారు. అలాగే కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర నిధులతో టిఆర్ఎస్ సర్కార్ షోకు

సర్పంచ్‌లకు నిధులు ఇవ్వకుండా వేధింపులు

పోడు రైతులపై పులులను వదులుతున్నారు: సోయం బాపూరావు

ఆసిఫాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): కేంద్రం ప్రభుత్వం ఇచ్చే నిధులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షో చేస్తోందని బీజేపీ ఎంపీ సోయం బాపురావు ఆరోపించారు. మంగళవారం నాడు ఆసిఫాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు ఇవ్వకుండా వారిని అప్పుల్లో కూరుకుని పోయేలా చేస్తోందని మండిపడ్డారు. రైతు వేదికలపై ప్రధానమంత్రి ఫోటోలను ఎందుకు పెట్టలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగని ఆయన.. పోడు వ్యవసాయం చేయకుండా ఇతర రాష్ట్రాల నుంచి పులుల్ని తీసుకువచ్చి అడవుల్లో వదులుతున్నారని ఆరోపణలు చేశారు. గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేది లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని సోయం బాపురావు హెచ్చరించారు. పోడు రైతులకు న్యాయం చేయమంటే పులులను వదులుతారా అని అన్నారు. ఇదిలావుంటే సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ బిరుదుగోండ్ తోటి యువ సేన ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 12న చేపడుతున్న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెందూర్ దత్తు కోరారు. ఉమ్మడి జిల్లాలోని తోటి గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలు సరైన ఫలితాలు ఇవ్వడం లేదని అన్నారు. సంచార జీవితాలు కొనసాగిస్తు ఊరూరా తిరుగుతూ అవస్థలు ఎదుర్కొంటున్న తోటీలకు స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేలా ఆదర్శ గ్రామాలను ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. తోటీల సంక్షేమం కోసం కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వంద శాతం సబ్సిడీపై పది లక్షల వరకు రుణాలు ఇవ్వాలని కోరనున్నామని అన్నారు.

దేవాలయాలపై దాడులను ఇక ఉపేక్షించేది లేదు

మన దేవాలయాలను మనమే కాపాడుకుందాం

మతమార్పిడులపై ప్రజలు ఆలోచన చేయాలి

మీడియా సమావేశంలో చంద్రబాబు పిలుపు

అమరావతి,జనవరి5(ఆర్ఎన్ఎ): రామతీర్థం ఘటన అమానుషమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఇక ఉపేక్షించేది లేదని అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రామతీర్థం పర్యటనకు అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి పోలీసులు అడుగడుగునా అడ్డుతగిలారని మండిపడ్డారు. రామతీర్థం పర్యటన చేపట్టడంతో ప్రభుత్వం భయపడి మాపై నిందలు వేస్తోందని, ఘటన జరిగి 5 రోజులైనా పట్టించుకోకుండా ఏం గడ్డి పీకారని చంద్రబాబు ప్రశ్నించారు. మన దేవాలయాలను మనమే కాపాడు కుందామని చంద్రబాబు ప్రజలకు పిలుపు ఇచ్చారు. గ్రామాల్లో పెరుగుతున్న చర్చిలపై హిందువులు ఆలోచన చేయాలని సూచించారు. రాష్ట్రంలో మతమార్పిడులు చేయించడానికి వీళ్లేదన్నారు. కుల మతాలకు అతీతంగా ఉంటానని చేసిన ప్రమాణాన్ని సీఎం జగన్ గుర్తించాలన్నారు. పాస్టర్లకు రూ.5 వేలు ఇవ్వడం చట్ట విరుద్ధమని, హిందువులతో పాటు ముస్లింలపైనా దాడులు జరుగుతున్నాయన్నారు. తప్పుడు కేసులు పెట్టే ఏ పోలీస్ అధికారిని వదిలిపెట్టమని చంద్రబాబు హెచ్చరించారు. సీఎం, హోంమంత్రి, డీజీపీ క్రిస్టియన్లు అయినంత మాత్రాన..దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఆపరా? అని ప్రశ్నించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు ఏ మసీదు, చర్చిపై దాడి జరగలేదన్నారు. మతమార్పిడులు చేయించే అధికారం సీఎంకు ఎవరిచ్చారని నిలదీశారు. హిందూ-ముస్లిం మనోభావాలు దెబ్బతీసే అధికారం ఎవరిచ్చారని చంద్రబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనాతో ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమయ్యే పరిస్థితి వచ్చిందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా క్రమంగా కోలుకుంటున్నామని చంద్రబాబు అన్నారు. బ్లీచింగ్ పౌడర్ వేస్తే పోతుందని గతంలో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అలా మాట్లాడడం సరికాదన్నారు. ప్రజల్లో చైతన్యం రావడంతో కరోనాను కట్టడి చేయగలిగామన్నారు. త్వరలో కరోనా వ్యాక్సిన్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు

సంక్రాంతి కోసం పందెం కోళ్ళు రెడీ

పోటీలపై సర్వత్రా అప్పుడే చర్చలు

కరోనాను లెక్క చేయకుండా ఏర్పాట్లు

ఆశగా ఎదురు చూస్తున్న కోళ్ల పెంపకందారులు

వరంగల్,జనవరి5(ఆర్ఎన్ఎ): సంక్రాంతికి మరో పదిరోజులూ సమయం ఉంది. కరోనా వేళ పండగను కుటుంబాలకే పరిమితం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల ఇప్పటికే సూచించారు. గోదావరి జిల్లాలతో పాటు, పల్నాడు, కృష్ణా,గుంటూరు జిల్లాల్లో కోడిపందాలకు పెట్టింది పేరు. అయితే ఇటీవల పరిస్థితులు కొంత మార్పు రావడంతో ప్రజలు ఇప్పటికే యధావిధిగా కార్యకలాపాల్లో పాల్గొంటన్నారు. దీంతో కోళ్ల పందాలకు కూడా కోళ్లను సిద్ధం చేస్తున్నారు. కోళ్లను పెంచి అమ్ముకునే వారు సైతం మంచి లాభాల కోసం ఎదురు చూస్తున్నారు . ఇకపోతే తెలంగాణలో పెంచుతున్న కోళ్లకు ఆంధ్రాలో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. సంక్రాంతి సందర్భంగా పందెం కోళ్లకు డిమాండ్ పెరుగుతోంది. రానున్న సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో జరిగే కోడిపుంజుల వేడుకకు తెలంగాణ పుంజులు సై అంటున్నాయి. పండుగ కోసం వివిధ జాతులకు చెందిన ఇక్కడి పుంజులకు గిరాకీ పెరిగింది. ఇక్కడ కొన్నేళ్లుగా పందెం కోళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడి ఫాంహౌజుల్లో చాలామంది కోళ్లకు తర్ఫీదనిచ్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ ఆర్థికంగా బలపడుతున్నారు. కేవలం ఆంధ్రాకే పరిమితమైన కోడి పందాలు ఇప్పుడు హైదరాబాద్‌కు కూడా పాకాయి. ఆంధ్రాలో కోట్లు చేతులు మారే పందాల కోసం జూదర్లు వరంగల్ జిల్లాకు చెందిన పుంజు లనూ భారీగా రంగంలోకి దించు తారనే సంగతి చాలామందికి తెలియదు. ఆంధ్రా ప్రాంతం వారు స్థిర నివసాం ఏర్పా టుచేసుకున్న ప్రాంతాలో ఇవి జరుపుతున్నట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లాలోని కాజీపేట, వరంగల్, హన్మకొండ, గ్రేటర్ గ్రామాల తోపాటు ఏటూరునాగారం, మంగపేట ప్రాంతాల్లో షెడ్లు ఏర్పాటు చేసి పందెం కోళ్లను పెంచుతున్నారు. ఏటా ఒక్కో కేంద్రంలో 100 నుంచి 200 వరకు కోళ్లను పెంచి పందాలకు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో కోడిపుంజు రూ.10వేల నుంచి రూ.లక్ష వరకూ అమ్ముడవుతుందని పెంపకందారులు చెబుతున్నారు.

క్యూఆర్‌కోడ్ అమలుతో.... ప్రయాణీకుల్లో భద్రతపై భరోసా

కరీంనగర్, జనవరి 5 (నేటినిజం ప్రతినిధి): ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే ప్రయాణీకుల భద్రత,రక్షణ సౌకర్యార్థం ప్యాసింజర్ వెహికిల్ డిజిటలైజన్ విధానాన్ని కొనసాగిస్తూ ప్రయాణీకులను చేరవేసే ఆటో/క్యాబ్‌లాంటి వాహనాలకు డిజిటల్‌బోర్డు,క్యూఆర్‌కోడ్(క్విక్ రెస్పాన్స్ కోడ్) అమలు చేస్తుండటంతో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే ప్రజలకు భద్రతపై భరోసా పెంపొందుతున్నది. ఈ విధానాన్ని వాల్వ్‌డాటా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో అమలుచేస్తున్నారు.

గత సంవత్సరం జనవరి 31న ఈ కార్యక్రమం ప్రారంభించిన విషయం విదితమే. ప్రయాణీకులను చేరవేసే ప్రతి ప్రైవేటు వాహనానికి యూనిక్‌నెంబర్/క్యూఆర్‌కోడ్ బోర్డును అమర్చారు. సాధారణ ఫోన్‌తోపాటు స్మార్ట్‌ఫోన్ కలిగిన వారందరూ ఈ విధానాన్ని వినియోగించుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ కలిగిన వారు క్యూఆర్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాహనానికి అమర్చిన డిజిటల్‌బోర్డ్, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకున్న వెంటనే వాహనం, వాహనదారుడికి సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయి.

ప్రయాణీకులకు ఎన్నెన్నో సౌకర్యాలు

ఇందులో ఎమర్జెన్సీకాల్, ఎమర్జెన్సీటెక్స్ట్, కాంప్లెంట్, రేటింగ్ అంశాలు ఉంటాయి. ఎమర్జెన్సీ కాల్ చేయగానే కమాండ్‌కంట్రోల్‌కు చేరుతుంది. ఎమర్జెన్సీ ఎలర్ట్ చేయగానే కమాండ్‌కంట్రోల్‌తోపాటు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందుతుంది. కాంప్లెంట్(ఫిర్యాదు) చేయగానే వాహనంలో ఏవైనా వస్తువులు మరచిపోయిన సందర్భంలో సదరు వాహనానికి సంబంధించిన డ్రైవర్ వివరాలు మెస్సేజ్ రూపంలో అందడంతోపాటు కమాండ్‌కంట్రోల్‌కు కూడా సమాచారం అందుతుంది. సాధారణఫోన్ వినియోగదారులు కూడా వాహనం బోర్డుపై ఉన్న నెంబర్‌కు మెస్సేజ్ (ఎస్‌యంఎస్)చేస్తే సంబంధిత పోలీసులకు ప్రయాణీకుడి వాహనానికి సంబంధించిన వివరాలు ఎస్‌యంఎస్ రూపంలో అందుతాయి.

హాక్ఐ, యూ జూ యాప్‌లకు అనుసంధానం

కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా ఇప్పటివరకు 10వేలకుపైగా ప్రైవేటు వాహనదారులు ఈ సౌకర్యం కోసం వాహనాలను రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం జరిగింది. కమీషనరేట్ వ్యాప్తంగా శరవేగంగా రిజిస్ట్రేషన్ల పర్వం కొనసాగుతున్నది. సేఫ్‌సిటిలో భాగంగా ప్రయాణీకుల భద్రత,రక్షణ కోసం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. పైన పేర్కొన్న డిజిటల్ బోర్డు, క్యూఆర్‌కోడ్‌లు హాక్ఐ, టివిస్‌కాప్ యాప్‌లను అనుసంధానం చేయబడింది. దీంతో ప్రయాణీకుల ఉన్న లొకేషన్ షేర్ అవుతుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలకు సంబంధించిన డ్రైవర్లకు ఐడికార్డులను అందజేస్తారు. క్యూఆర్‌కోడ్ స్టిక్కర్‌ను వాహనం బయట అద్దానికి, డ్రైవర్ సీటుకు వెనుక, వాహనం వెనుకభాగంలో అమర్చబడిఉంటుంది.

అవగాహన కార్యక్రమాలు

క్యూఆర్‌కోడ్ విధానం అమలుతో కలిగే ప్రయోజనాలపై ట్రాఫిక్ పోలీసులు పోలీస్ కళాబృందం సహకారంతో అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నగరంలో ప్రైవేటు వాహనాలకు అద్దాగా ఉన్న ప్రదేశాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్యాసింజర్ వెహికిల్ డిజిటలైజన్ విధానంలో భాగంగా క్యూఆర్‌కోడ్ వినియోగం కోసం ధరఖాస్తు చేయని ప్రైవేటు వాహనదారులకు ఈ-చలాన్లద్వారా జరిమానాలను విధిస్తున్నారు. కోవిడ్-19 ప్రభావంతో రిజిస్ట్రేషన్ల పక్రియకు కొంత అవరోధంగా మారిన ఎక్కువమంది ప్రైవేటు వాహనదారులు ఈ విధానాన్ని పాటించేందుకు స్వచ్ఛందంగా ముందుకువస్తున్నారు. ప్రజల రక్షణ,భద్రత కోసం వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తూ సఫలీకృతం అవుతున్న కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే వారికోసం ఈ విధానాన్ని కొనసాగించడం పట్ల అన్నివర్గాల ప్రజలు హర్షిస్తున్నారు.

రైతులతో చర్చల్లో కానరాని పురోగతి

మళ్లీ అసంపూర్తిగా ముగిసిన చర్చలు

చట్టాల రద్దుకు ముందుకు రాని ప్రభుత్వం

8న మరో దఫా చర్చలకు సుముఖం

దిగిరాకుంటే 26న ట్రాక్టర్లతో ర్యాలీ చేస్తామని రైతుల హెచ్చరిక

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): రైతులకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన ఏడవ దశ చర్చలు మళ్లీ అసంపూర్ణంగా ముగిశాయి. సమావేశం అనంతరం కేంద్ర ప్రభుత్వం, రైతు సంఘాల నేతల వ్యాఖ్యలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ చట్టాలు వెనక్కి తీసుకోవడం, కనీస మద్దతు ధర కల్పించడం.. ఈ రెండు అంశాలపై రైతులు పట్టుదలతో ఉన్నారు. అయితే రైతులు చేస్తున్న ఈ డిమాండ్‌ను ఒప్పుకోవడానికి సిద్ధంగా లేదు. డిసెంబర్ 30న రైతులకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన ఆరవ విడత చర్చల్లో దాదాపుగా సగం అంశాలపై ఇరు వర్గా మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని చర్చల అనంతరం కేంద్ర మంత్రి ప్రకటించారు.

అయితే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయాలన్నీ అసత్యాలని కొద్ది రోజుల అనంతరం రైతులు పేర్కొన్నారు. ఈసారి చర్చల్లో కూడా ఏకాభిప్రాయం కుదిరిందని చెప్తూనే వ్యవసాయ చట్టాల రద్దుపై రైతులు పట్టుదలగా ఉన్నారని కేంద్ర ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ఈ రోజు జరిగిన సమావేశం గురించి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ మూడు వ్యవసాయ చట్టాలపై క్లాజుల వారీగా చర్చిద్దామని రైతులను కోరాము. అయితే రైతులతో ఎలాంటి పరిష్కారానికి రాలేకపోయాం. వ్యవసాయ చట్టాల రద్దుపై రైతులు పట్టుదలతో ఉన్నారు. ఈరోజు జరిగిన సమావేశంలో కొంత ఏకాభిప్రాయం కుదిరిందనే అనుకుంటున్నాం. తర్వాతి జరిగే సమావేశంలో పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాం అని అన్నారు. ప్రభుత్వంపై రైతుల్లో నమ్మకం ఉందని, అందుకే చర్చల్లో సానుకూలంగా వారు ఉన్నారని అన్నారు. ఇక రైతు సంఘాల నేతలు మాట్లాడుతూ ఈరోజు చర్చల్లో పురోగతి ఏమీ లేదు. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవడం, కనీస మద్దతు ధర కల్పించడం మినహా ప్రభుత్వం ఏం చెప్పినా వినేది లేదు. వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోనంత వరకు మేము ఇంటికి వెళ్లేది లేదని భారతీయ కిసాన్ యూనియర్ నేత రాకేష్ తికైత్ అన్నారు. ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోయింది. మా డిమాండ్లను ఒప్పుకోవడం మినహా ప్రభుత్వానికి వేరే దారి లేదు. వ్యవసాయ చట్టాల రద్దు మినహా ప్రభుత్వం మరేం చెప్పినా వినేది లేదు.

వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకునే వరకు నిరసన చేపడతాం అని ఆల్ ఇండియా కిసాన్ సభ జనరల్ సెక్రెటరీ హన్నాన్ మొల్లాహ్ అన్నారు. వివాదాస్పద వ్యవసాయ చట్టాలను రద్దు చేయబోమని, అందుకోసం సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చునని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తమకు చెప్పారని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ నేత నర్వాన్‌సింగ్ పందేర్ తెలిపారు. సోమవారం నాలుగు గంటల పాటు కేంద్ర మంత్రులతో ఏడోదఫా చర్చలు జరిగిన తర్వాత సర్వాన్‌సింగ్ పందేర్ మీడియాతో మాట్లాడుతూ పై విషయం చెప్పారు. ఈ చర్చల్లోనూ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కి చట్టబద్ధత కల్పనపై చర్చిద్దామని రైతు సంఘాల నేతల ముందు కేంద్రమంత్రులు ప్రతిపాదించారు. కానీ రైతు సంఘాల నేతలు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌పై పట్టు వీడలేదు. ఈ నెల ఎనిమిదో తేదీన మరోదఫా చర్చలు జరిపేందుకు రైతు నేతలు అంగీకరించారు. తమ డిమాండ్లను ఆమోదించకుంటే రిపబ్లిక్ దినోత్సవం నాడు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఇంతకుముందు మాదిరిగా అందరితో చర్చలు జరుపడానికి బదులు వేర్వేరుగా చర్చలకు మంత్రులు ఆసక్తి చూపినట్లు కనిపిస్తున్నది. నవంబర్ 26వ తేదీ నుంచి ఢిల్లీ సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలి మధ్య రైతులు ఆందోళన సాగిస్తున్నారు. కేంద్రం చర్చలు ఫలించకపోతే నిపుణుల కమిటీని నియమిస్తామని గతనెలలో సుప్రీంకోర్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు, వివాదాస్పద చట్టాల వల్ల లబ్ధి పొందుతుందన్న వదంతుల మధ్య పంజాబ్‌లో జియో టవర్ల కూల్చివేయడాన్ని నిరసిస్తూ రిలయన్స్ జియో కోర్టును ఆశ్రయించింది.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సత్యవతి

ములుగు, జనవరి5: జిల్లాలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జ్పడీ చైర్మన్ కుసుమ జగదీశ్‌తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. వెంకటాపురం మండలం పాత్రాపురంలో రూ.22లక్షలతో నిర్మించి రైతు వేదిక, ఉప్పెడు వీరాపురం గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించారు. అలాగే ఉప్పెడు వీరాపురం నుంచి పాలెం వాగు వరకు 6.63 కోట్ల నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ హనుమంతు జెండగే, స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. సీఎం కేసీఆర్ రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు.

గిరిజనులను తరిమేందుకే పులులు వదిలారు

-ఎంపి సోయం బాబూరావు సంచలన వ్యాఖ్యలు

ఆదిలాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ):బీజేపీ ఎంపీ సోయం బాపు రావు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గిరిజనులను అడవులనుంచి వెళ్లగొట్టాలనే ఆలోచనతోనే పులుల్ని తెచ్చి వదిలారని... రాష్ట్రంలో మొత్తం 14-15 పులుల్ని వదిలారని మండిపడ్డారు. పులులను పట్టుకోవడం అటవీ శాఖ అధికారుకు పెద్ద సమస్య కాదని... కుట్ర పూరితంగా పులులను తెచ్చారు కాబట్టే పట్టుకోలేక పోతున్నారని ఆరోపణలు చేశారు. గిరిజనులను అడవులకు దూరం చేసే ప్రయత్నంలో భాగమే ఇది అని... మనుషుల ప్రాణాల కంటే పులుల ప్రాణాలు ముఖ్యం కాదన్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు మనుషుల ప్రాణాలకు విలువ ఇవ్వాలని... నకల్స్ తో సంబంధాలు ఉన్నాయని ఆదివాసులనే చంపుతున్నారని మండిపడ్డారు. ఇప్పుడు పులుల పేరిట ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని...చివరికి రోగాలు, నొప్పులతో కూడా ఆదివాసులే చనిపోతున్నారని ఆవేదన వక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవ పరిస్థితులు గుర్తించాలని కోరారు.

మళ్లీ బిజెపిలోకి వచ్చిన జీవిత

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ):సినీ నటి జీవితారాజశేఖర్ వైసీపీకి ఝలక్ ఇచ్చారు. వైసీపీలో చేరి జగన్‌ను విమర్శించి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి.. 2019 ఎన్నికల ముందు జగన్ సమక్షంలో మళ్లీ వైసీపీ కండువా కప్పుకున్న సినీ నటి జీవితారాజశేఖర్ తాజాగా బీజేపీలో చేరడం కొసమెరుపు. సోమవారం నాడు బండి సంజయ

గృహిణులకు నెలవారీ వేతనాలు

కమలహాసన్ సూచనను స్వాగతించిన శశిథరూర్

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): తమిళనాడు రాష్ట్రంలోని గృహిణులకు ప్రభుత్వ వేతనాలంటూ మక్కల్ నీది మయ్యమ్ అధినేత, నటుడు కమల్‌హాసన్ చేసిన ప్రతిపాదనను కాంగ్రెస్ సీనియర్ నేత, పార్లమెంటు సభ్యుడు శశిథరూర్ అభినందించారు. ఈ మేరకు మంగళవారంనాడు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఇంటి పనులు చక్కబెట్టుకోవడాన్ని సేలరీడ్ ప్రొఫెషన్‌గా గుర్తించాలని, గృహిణులకు రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ వేతనాలు ఇవ్వాలని కమల్‌హాసన్ ఆలోచనను స్వాగతిస్తున్నట్టు శశిథరూర్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. తద్వారా మహిళా సేవలకు తగిన గుర్తింపు, శ్రమకు తగిన ఫలితం కలుగుతుందని, గృహిణుల శక్తి, స్వయం ప్రతిపత్తికి ఇదెంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. త్వరలో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కమల్‌హాసన్ ఇటీవల హామీల వర్షం గుప్పించారు. రాష్ట్రంలోని గృహిణులకు వేతనాలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తద్వారా ఎన్నికల హామీల్లో గృహిణుల ప్రస్తావన చేసిన మొదట వ్యక్తిగా ఆయన నిలిచారు. ఏడు పాయింట్ల ఎజెండాతో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తున్నామని, అందులో గృహిణులకు నెలవారీ వేతనాల అంశం ఒకటని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మక్కల్ నీది మయ్యమ్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఇచ్చిన హామీలన్ని నేరవేరుస్తామని ప్రకటించారు.

నిలకడగా గంగూలీ ఆరోగ్యం

నేడు డిశ్చార్జ్ చేస్తామన్న వైద్యులు

కోల్‌కతా,జనవరి5(ఆర్ఎన్ఎ): టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఆరోగ్యం స్థిరంగా ఉందని, బుధవారం ఆసుపత్రి నుంచి ఆయనను డిశ్చార్జి చేయనున్నట్లు డాక్టర్లు చెప్పారు. గంగూలీ గుండెపోటుకు గురై కోల్‌కత్తాలోని ఉడ్ ల్యాండ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోన్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లు వివరాలు తెలిపారు. అనంతరం గంగూలీ ఆరోగ్య పరిస్థితిని ఆయన ఇంట్లోనే పర్యవేక్షిస్తామని వివరించారు. గంగూలీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉండటంతో యాంజియోప్లాస్టీ వాయిదా వేయడమే సురక్షితమని వైద్యులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. రెండు లేదా మూడు వారాల తర్వాత ఆయన కోలుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత ఆయన చికిత్సకు సంబంధించి మరో కోర్సు ప్రారంభిస్తామని చెప్పారు.

కెసిఆర్ అవినీతిని బయటపెడతాం

ఎన్నిక ఏదైనా గెలుపు ఇక బిజెపిదే
జీహెచ్ఎంసి కార్పోరేటర్లతో సమావేశమైన బండి సంజయ్
ప్రగతిభవన్ ముట్టడికి కార్పోరేటర్లు ప్రయత్నించడంతో ఉద్రిక్తత

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): త్వరలోనే సిఎం కెసిఆర్ అవినీతిని బయటపెడతామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మరోసారి కేసీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన అవినీతితో ఇక జైలుకు వెళ్లక తప్పదన్నారు. మరో మూడేళ్లు ముఖ్యమంత్రి కేసీఆరే అని... కేటీఆర్ ను సిఎం చేసే ఆలోచన కేసీఆర్‌కు లేదని కూడా బండి సంజయ్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ, గడీల, అవినీతి ప్రజావ్యతిరేక పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని... టీఆర్ఎస్‌ను ఎదుర్కోనే దమ్ము ఉన్న ఏకైక పార్టీ బిజెపి అని స్పష్టం చేశారు. బేగంపేట భహరిత హోటల్‌లో మంగళవారం బిజెపి కార్పోరేటర్లతో సమావేశం అయ్యారు. బిజెపి కార్పోరేటర్లు జిహెచ్ఎంసిలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు బిజెపి వైపు నిలబడుతున్నారని...ఇందుకు నిదర్శనమే ఇటీవల జరిగిన దుబ్బాక, హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలు అన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కబ్జాల పర్వానికి కెసిఆర్ చమురగీతం పాడకపోతే బీజేపీ సత్తా ఏమిటో చూపిస్తామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు మంజూరు చేస్తుంటే.. కమీషన్ల పేరిట కోట్లకు కోట్లు వెనకేస్తూ.. ఎన్నికల్లో ఖర్చు పెట్టి ఓట్లు కొనుగోలు చేయాలని కేసిఆర్ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు తిప్పి కొడుతున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ కుటుంబం ఆరేళ్లుగా చేస్తున్న అవినీతి అక్రమాల చిట్టా త్వరలోనే బయట పెడతామని హెచ్చరించారు. ఎన్నికల వరకే రాజకీయాలని... ఆ తర్వాత ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం డబ్బులతో ఓట్లు కొనుగోలు చేయాలనే ప్రయత్నాన్ని మరోసారి ప్రజలు తిప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఇదిలావుంటే సమావేశం ముగియగానే బండి వరంగల్ పర్యటనకు బయలుదేరారు. ఇకపోతే బిజెపి కార్పోరేటర్లు మాత్రం ప్రగతి భవన్ ముట్టడికి ప్రయత్నించారు. ఒక్కసారిగా వచ్చిన బీజేపీ కార్పొరేటర్లు సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎన్నికలు జరిగి, గెలిచిన తర్వాత ఇంతవరకు కార్పొరేటర్లగా గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, కొత్త పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తాము గెలిచినా తమ నియోజక వర్గాల్లో పనులు చేయలేకపోతున్నామని, ఇంకా పాత కార్పొరేటర్లే అధికారం చెలాయిస్తున్నారని బీజేకీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్లకు విలువ లేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం జీహెచ్ఎంసీ పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిభవన్ ఎదుట రోడ్డుపై కార్పొరేటర్లు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. బేగంపేటలోని హోటల్ హరితలో సమావేశమైన బిజెపి కార్పొరేటర్లు ప్రగతి భవన్ ముందు ధర్నా యోచన చేస్తున్నారని వార్తలు రావడంతో హో÷రిళిటల్ హరిత ముందు ప్రగతి భవన్ ముందు భారీగా పోలీసుల మోహరించారు. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్ల తో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు బీజేపీ కార్పొరేటర్లు. పోలీసుల కళ్లుగప్పి ప్రగతి భవన్ మెయిన్ గేట్ ముందుకు వచ్చిన బీజేపీ కార్పొరేటర్లకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో వారందరినీ అరెస్ట్ చేసిన పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

చాపకిందనీరుల విస్తరిస్తున్న బర్డ్‌ఫ్లూ

కాకులు, బాతులు మృతితో అప్రమత్తమైన ప్రభుత్వాలు
మధ్యప్రదేశ్ మందసౌర్‌లో 15రోజులపాటు చికెన్ సెంటర్ల మూసివేత

భోపాల్,జనవరి5(ఆర్ఎన్ఎ): ఒక పక్క కరోనాతో దేశం సతమతమవుతుంటే మరోవైపు చాపకింద నీరులా బర్డ్‌ఫ్లూ విస్తరిస్తోంది. తాజాగా ఈ మహమ్మారి నాలుగు రాష్ట్రాల్లో వ్యాప్తి చెందడం ఆందోళన కలిగిస్తోంది. తొలుత రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వెలుగుచూసిన ఈ వైరస్ క్రమంగా ఇతర రాష్ట్రాలకు పాకుతోంది. తాజాగా కేరళ, హిమాచల్ ప్రదేశ్‌లోని బర్డ్‌ఫ్లూను గుర్తించారు. కేరళలోని కొట్టాయం, అలపుజా జిల్లాలో భారీ సంఖ్యలో బాతులు, కోళ్లు మృత్యువాత పడ్డాయి. దాంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. వాటి నమూనాలను పరీక్షల నిమిత్తం భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజన్‌కి పంపించారు. ఆ ప్రాంతాలకు ఒక కి.మీ. పరిధిలోని ప్రాంతాల్లో ఉన్న బాతులు, కోళ్లు 40వేలకు పైగా వాటిని చంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు ఈ వైరస్ సోకే ప్రమాదం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజస్థాన్‌లో ఏవియన్ ఫ్లూ కారణంగా కాకుల మరణాలు కొనసాగు తుండగానే మధ్యప్రదేశ్‌లో కుప్పలు తెప్పలుగా కాకులు మృతిచెందుతుండటం కలకలం రేపుతున్నది. ఇటీవల మధ్యప్రదేశ్‌లో వరుసగా కాకులు మరణిస్తున్నాయి. ఇప్పటివరకు మొత్తం 400 కాకులు మృత్యువాత పడ్డాయి. అయితే, ఒక కొత్త రకం వైరస్ కారణంగా ఈ కాకుల మరణాలు సంభవిస్తున్నట్లు వైద్యాధికారుల పరిశోధనల్లో తేలిందని మధ్యప్రదేశ్ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే రోకే చెప్పారు. ఈ కొత్త వైరస్ ప్రభావం పౌల్ట్రీల్లో కనిపించడంలేదని, కేవలం గాల్లో ఎగిరే పక్షుల్లోనే ఉన్నదని రోకే తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలో వైరస్ ప్రభావం కనిపిస్తున్నదని చెప్పారు. ఈ వైరస్ రాజస్థాన్ నుంచి వచ్చి ఉంటుందని, ప్రస్తుతం దీనికి ఎలాంటి వ్యాక్సిన్ లేదని రోకే వెల్లడించారు. బర్డ్‌ఫ్లూతో వందల సంఖ్యలో కాకులు మృత్యువాత పడటంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. మంద్‌సౌర్‌లో 15 రోజుల పాటు చికెన్, గుడ్ల విక్రయించే దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ఒక్క మంద్‌సౌర్‌లోనే బర్డ్‌ఫ్లూ కారణంగా 100 కాకులు చనిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా బర్డ్‌ఫ్లూ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇండోర్‌లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి ప్రేమ్ సింగ్ పటేల్ తెలిపారు. గత డిసెంబర్ 23 నుంచి జనవరి 3 మధ్యలో మధ్యప్రదేశ్‌లో కొన్ని వందల సంఖ్యలో కాకులు మృత్యువాత పడ్డాయి. ఇప్పటికే కేరళలోనూ బర్డ్‌ఫ్లూ జాడలు కనిపించడంతో అక్కడి ప్రభుత్వం దీనిని విపత్తుగా ప్రకటించింది.

రామచంద్రాపురంలో దొంగల బీభత్సం

జనగామ,జనవరి5(ఆర్ఎన్ఎ): జిల్లాలోని బచ్చన్నపేట మండల రామచంద్రపురంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి సమయంలో రామచంద్రపురంలోని 11 ఇండ్లల్లో దొంగతనం చేసి పెద్దమొత్తంలో నగదు, బంగారం అపహరించారు. గ్రామంలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ గా చేసుకున్న దొంగలు అర్ధరాత్రి సమయంలో చోరీలకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవన్ రెడ్డి ఇంటికి వందలాదిగా కార్యకర్తలు

పుట్టిన రోజు కావడంతో అభినందనలు
పిసిసి చీఫ్ ఆయనే అంటూ ప్రచారంతో తరలివచ్చిన నేతలు
తనకు సమాచారం లేదని తప్పించుకున్న జీవన్

జగిత్యాల,జనవరి5(ఆర్ఎన్ఎ): పిసిసి అధ్యక్షుడిగా తనను నియమించారనే విషయంలో తనకు ఎటువంటి సమాచారం లేదని ఎమమెల్సీ జీవన్‌రెడ్డి అంటున్నారు. ఇప్పటి వరకు పీసీసీ అధ్యక్ష పదవి ఖరారు అయిందని ఎలాంటి సమాచారం లేదన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు తనకు సముచిత స్థానం కల్పించిందన్నారు.. పదవి వచ్చినా రాకపోయినా తాను పార్టీ బలోపేతం కోసం సామాన్య కార్యకర్త గానే పనిచేస్తానని ప్రకటించిన జీవన్‌రెడ్డి.. భవిష్యత్తు మాత్రం కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు పిసిసి చీఫ్‌గా జీవన్‌రెడ్డిని నియమించనున్నారన్న వార్తల నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. దీనికితోడు మంగళవారం జీవన్‌రెడ్డి పుట్టినరోజు కావడంతో శుభాకాంక్షలు తెలిపేందుకు వస్తున్నారు. కాగా టీపీసీసీ రేసులో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు అనూహ్యంగా ప్రచారంలోకి వచ్చింది. ఎంపీ రేవంత్‌రెడ్డే కాబోయే చీఫ్ అంటూ వార్తలు వచ్చినప్పటికీ..

రేవంత్‌ను ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించనున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ కూడా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. రేవంత్‌రెడ్డిని పీసీసీ చీఫ్‌గా పార్టీలోని మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కొందరు సీనియర్లు అంగీకరించడం లేదని తెలుస్తోంది. అయితే ప్రజాకర్షణ, కార్యకర్తల మద్దతు మాత్రం రేవంత్‌కే ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా జీవన్‌రెడ్డిని పీసీసీ చీఫ్‌గా, రేవంత్‌ను ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించే యోచనలో అధిష్టానం ఉందన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణ పీసీసీ చీఫ్ ఎవరనే దానిపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు పూర్తి చేశాక, అధ్యక్షురాలు సోనియాగాంధీ ఈ విషయంలో నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి పీసీసీ పగ్గాలు అప్పగించాలని సోనియాగాంధీ నిర్ణయించినట్లు సమాచారం. పార్టీలో అందరికి ఆమోదయోగ్యంగా ఉండే నిర్ణయాన్ని తీసుకోవాలని భావించిన ఏఐసీసీ.. వారం క్రితమే జీవన్‌రెడ్డిని ఢిల్లీకి పిలిచి మాట్లాడింది. ఆ తర్వాత గ్రౌండ్ ప్రిపేర్ చేసిన అధిష్టానం... దీనిపై తుదినిర్ణయం తీసుకున్నట్టు.. దీనిపై అధిష్టానం ఏ క్షణంలోనైనా ప్రకటన చేయనున్నట్టు ప్రచారం సాగుతోంది. మరోవైపు.. జీవన్ రెడ్డి ఇంటి దగ్గర ఉదయం నుంచి కార్యకర్తలు హడావుడి చేస్తున్నారు.. పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు. దీనిపై జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ పదవి వచ్చినా సామాన్య కార్యకర్త గానే పనిచేస్తానని తెలిపారు.. మీడియాలో వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. పత్రికల్లో, టీవీల్లో వస్తున్నది మాత్రం ఊహాజనితం మాత్రమేనని.. తనకు మాత్రం పదవి గురించి ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదని స్పష్టం చేశారు.

రైతు బజార్ వద్ద అక్రమణలు తొలగింపు

హైదరాబాద్,జనవరి5(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ వనస్థలిపురం రైతు బజార్ వద్ద అక్రమణలను పోలీసులు తొలగించారు. మంగళవారం ఉదయం సుమారు 20మంది పోలీసులు రైతు బజారు వద్ద ఉన్న సంపూర్ణ థియేటర్ ఎదురుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగించారు. అదేవిధంగా రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండ్లను వ్యాన్‌లో ఎక్కించి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్న దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. పోలీసుల చర్యలపై చిరువ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలగింపుపై పోలీసులతో వాగ్వాదానికి దిగారు

దేశంలో త్వరలోనే అతిపెద్ద టీకా పంపిణీ కార్యక్రమం

వ్యాక్సిన్లను అభివృద్ధి పరచిన మన శాస్త్రవేత్తలు దేశానికి గర్వకారణం
నేషనల్ మెట్రోలజీ కాంక్లేవ్-2021ను ఉద్దేశించి ప్రధాని ప్రారంభోపన్యాసం

న్యూఢిల్లీ,జనవరి5(ఆర్ఎన్ఎ): భారత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీకా పంపిణీ కార్యక్రమం త్వరలోనే ప్రారంభం కాబోతున్నదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో దేశంలో రెండు కోవిడ్ వ్యాక్సిన్లను విజయవంతంగా అభివృద్ధి పరచిన భారతీయ శాస్త్రవేత్తలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. భారతదేశం చేపట్టబోయే కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రపంచంలోనే అతి పెద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమమని, ఇది త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. భారతదేశంలో త్వరలోనే అతిపెద్ద కోవిడ్-19 వ్యాక్సిన్ డ్రైవ్ ప్రారంభం కానున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సోమవారంనాడు నేషనల్ మెట్రోలజీ కాంక్లేవ్-2021ను ఉద్దేశించి ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. నేషనల్ ఆటోమేటిక్ టైమ్‌స్కేల్, భారతీయ నిర్దేశక్ ద్రవ్య ప్రణాళిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశ ప్రజలకు మోదీ అంకితం చేశారు. జాతీయ పర్యావరణ ప్రమాణాల లేబెరేటరీకి శంకుస్థాపన చేశారు. స్వదేశంలో కొవిడ్ టీకాలను అభివృద్ధి చేయడంలో మన శాస్త్రవేత్తలు విజయవంతమయ్యారని కొనియాడారు. రెండు స్వదేశీ వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తెచ్చిన శాస్త్రవేత్తలను చూసి దేశం గర్విస్తోందన్నారు. కరోనా వ్యాక్సిన్ ఉత్పత్తి నేపథ్యంలో మేకిన్ ఇండియా గురించి మాట్లాడిన ప్రధాని.. మనం తయారుచేసే ఉత్పత్తులకు పరిమాణం ఎంత ముఖ్యమో, నాణ్యత కూడా అంతే ముఖ్యమన్నారు. నాణ్యత, విశ్వసనీయతగల ఉత్పత్తులను తీసుకొస్తూ మన బ్రాండ్ ఇండియాను మరింత బలోపేతం చేయాలన్నారు. మేకిన్ ఇండియా ఉత్పత్తులకు డిమాండ్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆమోదం లభించేలా కృషి చేయాలన్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్ 50 దేశాల్లో ఒకటిగా నిలిచిందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమ, సంస్థల మధ్య సహకారం మరింత బలపడుతున్నదని ఆయన చెప్పారు. అందుకే సరికొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులతో శాస్త్రవేత్తలు ముఖాముఖీ జరిపి, సంస్థ సాధిస్తున్న విజయాలను వారికి తెలియజేయాలని, వారిని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్దిదిద్దేందుకు కృషి చేయాలని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)ను ప్రధాని కోరారు. దేశం ఎదుర్కొంటున్న ప్రతి సవాలుకు కలిసికట్టుగా పరిష్కారం కనుగొనేందుకు సీఐఎస్ఆర్ సహా దేశంలోని సైంటిఫిక్ ఇన్‌స్టిట్యూషన్లు చేస్తున్న కృషి శ్లాఘనీయమని అన్నారు. సీఎస్ఐఆర్ నేషనల్ ఫిజికల్ లేబరేటరీ (ఎన్‌పీఎల్) కృషిని కూడా ప్రధాని కొనియాడారు. గతంలో సాధించిన విజయాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు సిద్ధం కావడానికి సదస్సులో జరిగే చర్చలు ఉపకరిస్తాయన్న ఆశాభావాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. స్వయం సమృద్ధ భారతం దిశగా కొత్త ప్రమాణాలు నెలకొల్పడం, కొత్త విజయాలు సాధించడంలో సంస్థ కీలక భూమిక పోషించాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాని నేషనల్ అటామిక్ స్కేల్, నిర్దేశక్ ద్రవ్యలను ప్రధాని మోదీ ప్రారంభించారు. కోవ్యాక్సిన్, కొవిషీల్డ్ టీకాల అత్యవసర వినియోగానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేషనల్ మెట్రాలజీ కాన్క్లేవ్‌లో వీడి యో కాన్ఫరెన్సింగ్ ద్వారా పాల్గొన్న మోదీ.. వ్యాక్సినేషన్ డ్రైవ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యాక్సిన్ అభివృద్ధి కోసం సైంటిస్టులు, టెక్నీషియన్స్‌కు అందరమూ రుణపడి ఉంటామన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధి కోసం కృషి చేసిన సైంటిస్టులు, టెక్నీషియన్స్‌కు మొత్తం దేశం రుణపడి ఉంది. భారత ఉత్పత్తులతో ప్రపంచాన్ని నింపేయాలని మేం భావించడం లేదు. అయితే భారత ప్రొడక్ట్స్‌ను వాడుతున్న ప్రపంచంలోని ప్రతి కస్టమర్ హృదయాన్ని మనం దోచుకోవాలి. గ్లోబల్ డిమాండ్‌కు తగ్గట్లు మేడిన్ ఇండియా ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలి. మనం రూపొందించే ఉత్పత్తులు క్వాలిటీతో ఉండేలా చూసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు రంగం అనే సంబంధం లేకుండా అందరూ ఉత్పత్తుల మన్నిక పై దృష్టి పెట్టాలి. మన ప్రొడక్ట్‌ల స్టాండర్డ్స్‌ను బట్టి ప్రపంచ మార్కెట్‌లో భారత్‌కు డిమాండ్ పెంచాలి' అని మోదీ పేర్కొన్నారు.

హిందూ మనోభావాలు దెబ్బతీస్తున్న సిఎం

రామతీర్థం ఘటనను తప్పుదారి పట్టించే యత్నంలో జగన్
మండిపడ్డ స్వామి శ్రీనివాసనంద సరస్వతి

విశాఖపట్నం,జనవరి5(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేక రామతీర్థం ఘటనలు జరుగుతున్నాయని సీఎం చెప్పడం సరికాదని స్వామి శ్రీనివాసనంద సరస్వతి అన్నారు. అలాంటి ఆధారాలు ఉంటే చూపాలన్నారు. గత కొన్ని రోజులుగా ఆలయాలపై జరుగుతున్న దాడుల పట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించి తీరుపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై మంగళవారం నాడు స్వామి శ్రీనివాసనంద సరస్వతి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిరాధార ఆరోపణలు చేయవద్దన్నారు. మీరు ఎవరి మీద అయితే ఆరోపణలు చేశారో వాటిని నిరూపించాలన్నారు. హిందూ సమస్యను రాజకీయ చేయవద్దు. దయచేసి హిందూ మనోభావాలు దెబ్బతీయకండి. రామతీర్థంకు వస్తున్న హిందూ బంధువులను అనుమతి ఇవ్వాలి. మంత్రి వెల్లంపల్లి మంత్రి పదవి నుంచి తప్పుకోవాలి. నిజాలు రాస్తున్న ప్రతికలను ముఖ్యమంత్రి గొంతు నొక్కుతున్నారు. అధికారం ఉందని జగన్ కళ్ళు నెత్తి కెక్కి మాట్లాడుతున్నారు. నిజాలు రాస్తున్న మీడియాను ఎల్లో మీడియా అంటూ కించపరిచి మాట్లాడడం సరికాదు' అని శ్రీనివాసనంద సరస్వతి వ్యాఖ్యానించారు.

కేరళ తరహాలో ధాన్యం సేకరణ జరగాలి

రైతులకు మద్దతు ధరలపై బోనస్ ఇస్తేనే గిట్టుబాటు
పార్టీల నేతల గుప్పిట్లో రైస్ మిల్లులు ఉండబట్టే దోపిడీ: సిపిఎం

విజయవాడ,జనవరి5(ఆర్ఎన్ఎ): కేరళ వామపక్ష ప్రభుత్వం రూ.1000 బోనస్ ఇచ్చి క్వింటాల్ రూ.2668కు ధాన్యం సేకరిస్తున్న తీరు దేశానికి ఆదర్శంగా నలిచిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం కృష్ణమూర్తి అన్నారు. కేరళ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం న్యాయమైన ధర చెల్లిస్తుండగా బిజెపి, వైసిపి తదితర ప్రభుత్వాలు రైతుకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ధాన్యంచేతికి వచ్చి ఇరవై ఐదు రోజులు దాటింది. అంతకు ముందే తమ ప్రభుత్వం ప్రతిగింజా కొంటుందని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ప్రకటన చేసేశారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మాత్రం కొనడం లేదని, కొనకుండానే కొంటున్నట్లు రికార్డులు సృష్టించారని ఆరోపించారు. రైతు సంఘాలు, సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు గట్టిగా పోరాడిన చోట ప్రభుత్వ మద్దతు ధర చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనకపోయినా రైస్ మిల్లుల్లో ధాన్యం బస్తాల దిబ్బలు వున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతుకు వేరే మార్గం కనిపించక ఎంతో కొంతకు దళారులకు అమ్ముకుంటున్నారు. దీంతో దారుణంగా నష్టపోతున్నారు. దళారుల ద్వారా తక్కువకు కొన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ కనీస మద్దతు ధరకు కొన్నట్లు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం నుండి కనీస మద్దతు ధర కొట్టేసి రైతుకు తక్కువ ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు, ప్రభుత్వ అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రైతును దోచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించినా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక రైతుకు న్యాయమైన ధర రావడం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం రైతు పంటపై పెట్టిన పెట్టుబడికి రైతు కుటుంబ శ్రమ, మరో 50 శాతం కలిపి ఆ మొత్తం రైతుకు దక్కేలా కనీస మద్దతు ధర నిర్ణయించాలి. ధర వచ్చేంత వరకు రైతు పంట నిల్వ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు, గోదాములు నిర్మించి రైతుకు అందుబాటులో వుంచాలని చెప్పింది. ప్రభుత్వ మార్కెట్ వ్యవస్థను విస్తృతపర్చాలని చెప్పింది. రైతుకు ప్రభుత్వం పెట్టుబడి సదుపాయం కల్పించాలని చెప్పింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేస్తానన్న మోడీ ఇపుడు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవసాయ చట్టాలు తీసుకని వచ్చారని అన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం నిర్ణయిస్తే ధాన్యానికి క్వింటాలుకు రూ.2668 కనీస మద్దతు ధర చెల్లించాలి. కానీ మోడీ ప్రభుత్వం క్వింటాలుకు రూ.1868 మాత్రమే కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. మోడీ, జగన్ చెప్పిన ధరల స్థిరీకరణ నిధి ఏమైపోయిందని ప్రశ్నించారు. బిజెపి, వైసిపి, టిడిపి తదితర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎం.పి లు, మంత్రుల్లో ఏదో కొద్ది మంది మినహా అందరూ రైస్ మిల్లర్లేనని ఆరోపించారు. మిల్లర్లలో టిడిపి కి చెందిన నాయకులు ఉండడమే అసలు రహస్యం అన్నారు. వ్యవసాయ చట్టాలకు టిడిపి, వైసిపి పార్టీల మద్దతు ఇవ్వడం మహా దారుణం అన్నారు.

సైకిల్‌పై మంత్రి పువ్వాడ పట్టణయాత్ర

క్షేత్రస్థాయిలో సమస్యలపై ప్రజలతో చర